
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





విద్యుత్ కాంతుల్లో జగదాంబ జంక్షన్ వద్ద ట్రినిటీ లూథరన్ చర్చి

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

- జిల్లా ఆరు జోన్లుగా విభజన
- ఏ జోన్‌లో విద్యార్థులకు ఆ జోన్‌లోనే పరీక్ష కేంద్రాల కేటాయింపు
- ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు



ఆర్‌ఐవో మురళీధర్

మద్దిలపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష కేంద్రాలు దూరాభారం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నాలుగైదు కిలోమీటర్ల పరిధిలోనే పరీక్షల కేంద్రాలు ఉండేలా చర్యలు చేపట్టారు. అందుకు అగనంపూడి నుంచి తగరపువలస వరకూ ఆరు జోన్లు (తగరపువలస, పెందుర్తి, గాజువాక, మధురవాడ, వెంకోజీపాలెం-అక్కయ్యపాలెం, అక్కయ్యపాలెం-ఎన్‌ఏడీ జంక్షన్)గా విభజించారు. ఏ జోన్ పరిధిలోని విద్యార్థులు ఆ జోన్‌లోనే

... మిగతా 6వ పేజీలో

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు



పునీత ఆంథోనీ చర్చిలో మంగళవారం రాత్రి ప్రార్థనలు

- చర్చిల్లో ప్రార్థనలు ప్రారంభం

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని చర్చిలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. వన్‌టౌన్‌లోని సెయింట్ జాన్స్, సర్క్యూట్ హౌస్ ఎదురుగా ఉన్న సెయింట్ పాల్స్, జిల్లా కోర్టు సమీపంలోని పునీత ఆంథోని వారి దేవాలయం, జగదాంబ జంక్షన్ సమీపంలోని ట్రినిటీ లూథరన్ చర్చి, పోర్టు హాస్పిటల్ సమీపంలోని లూర్దు మాత చర్చిల్లో మంగళవారం రాత్రి నుంచి ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ నేపథ్యంలో మార్కెట్ కళకళలాడింది. క్రిస్మస్ ట్రీ, ఇతర అలంకరణ సామగ్రి, స్వీట్స్, కేకులు, గిఫ్టుల కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడాయి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

వైసీపీ నిర్లక్ష్యం పేదలకు శాపం



రంగులతోనే సరి..

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ నగర పరిధిలో టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) ఆధ్వర్యంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. 2024 ఎన్నికలకు ముందు హడావిడిగా కొన్ని లేఅవుట్లలో పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేసినా, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో వాటిల్లో నివాసం ఉండలేని పరిస్థితి నెలకొంది.

పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అప్పట్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పట్టణం) (పీఎంఏవై) పథకం-అందరికీ ఇళ్లు (అఫార్డబుల్ హౌస్ ఫర్ ఆల్) కింద రాష్ట్రానికి దాదాపు 7 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 3.19 లక్షల ఇళ్లు పట్టణ పేదలకు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. నోడల్ సంస్థగా టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) ఇళ్ల పనులు చూస్తోంది. టిడ్కో ఇళ్ల కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో

... మిగతా 6వ పేజీలో



పెదగంట్యాడ మండలం భానోజీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

టిడ్కో ఇళ్ల నిర్మాణంలో తీవ్ర అలసత్వం

- ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోపు లబ్ధిదారులకు అప్పగిస్తామంటూ ఆర్భాటం
- ఇదిగో...అదిగో అంటూ ఐదేళ్లపాటు కాలక్షేపం
- టీడీపీ హయాంలో చివరి దశకు చేరిన ఇళ్లకు తుదిమెరుగులు దిద్దడానికే పరిమితం
- కేవలం రంగులు మార్చడంతోనే సరి
- ఎన్నికలకు ముందు 7,456 మందికి మాత్రమే కేటాయింపు
- కొన్నిచోట్ల మౌలిక సదుపాయాలు కల్పించకుండానే ఇళ్ల అప్పగింత
- ఇక మిగిలిన లేఅవుట్లలో ఎక్కడి పనులు అక్కడే...
- ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు

జీవీఎంసీ పరిధిలో టిడ్కో లేఅవుట్‌లు	31
నిర్మాణం ప్రారంభించిన ఇళ్లు	24,192
ఇప్పటివరకూ లబ్ధిదారులకు అందజేసినవి	7,456
గృహ ప్రవేశాలు జరిగిన ఇళ్లు	4 వేలు లోపే

కొమ్మాదిలోనూ అదే పరిస్థితి

కొమ్మాది, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత తెలుగుదేశం ప్రభుత్వం కొమ్మాదిలోని చైతన్య ఇంజనీరింగ్ కళాశాల సమీపాన 7 బ్లాకుల్లో 48 చొప్పున 336 ఫ్లాట్ల నిర్మాణం చేపట్టింది. వీటిలో 144 డబుల్, 192 సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు ఉన్నాయి. అలాగే బక్కన్నపాలెంలో 8 బ్లాకుల్లో 48 చొప్పున 384 ఫ్లాట్ల నిర్మాణం చేపట్టింది. 2019 ఎన్నికల నాటికి దాదాపు 75 శాతం నిర్మాణం పూర్తి కాగా, ఆ తరువాత ప్రభుత్వం మారడంతో పనులు ముందుకుసాగలేదు. కొమ్మాదిలో దాదాపు నిర్మాణం పూర్తయిన కొన్ని బ్లాకుల్లో ప్లంబింగ్, కరెంటు పనులు కాలేదు. రోడ్లు, డ్రైనేజి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. బక్కన్నపాలెంలో ఇంకా ఇళ్ల నిర్మాణం పూర్తికావలసి ఉంది. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టు సంస్థలు పనులు నిలిపివేశాయి. దీంతో బక్కన్నపాలెంలో టిడ్కో గృహ సముదాయాల చుట్టూ ముళ్లకంపలు పెరిగిపోయాయి. కనీసం లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్లను చూసుకోవడానికి వెళదామన్నా దారి లేని పరిస్థితి నెలకొని ఉంది. కొమ్మాది, బక్కన్నపాలెంలో పనులు త్వరలో పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని టిడ్కో ఈఈ సుధాకర్ తెలిపారు.



బక్కన్నపాలెంలో నిర్మాణదశలో ఉన్న టిడ్కో ఇళ్లు

అసంపూర్తిగా నిర్మాణాలు



భానోజీ కాలనీ టిడ్కో గృహ సముదాయానికి తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న అసంపూర్తి రిజర్వాయర్‌ట్యాంక్

పెదగంట్యాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ ప్రాంతంలో రెండుచోట్ల టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వాటిలో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. మరికొన్ని పూర్తయినా ప్రాథమిక వసతులు లేవు. లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించి రిజిస్ట్రేషన్ చేసేశామని అధికారులు చెబుతున్నారు. అయితే విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి సౌకర్యాలు లేని ఈ ఇళ్లల్లో తామెలా ఉండేదని పలువురు లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించి తమకు అప్పగించాలని వారు కోరుతున్నారు. దయాళ్‌నగర్‌లో బీసీ రోడ్డు పక్కన ఏడున్నర ఎకరాల్లో 654 గృహాల నిర్మాణ పనులను అప్పటి టీడీపీ ప్రభుత్వం 2017లో ప్రారంభించి 2019 నాటికి 90 శాతం పూర్తిచేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించి రిజిస్ట్రేషన్లు చేసింది. కానీ ప్రాథమిక సౌకర్యాలు కల్పించలేదు. అలాగే భానోజీ కాలనీలోని కొండవాలు ప్రాంతంలో 22 ఎకరాల్లో 1,056 గృహాల నిర్మాణం చేపట్టారు. అప్పటి టీడీపీ హయాంలోనే 80 శాతం పనులు పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక మరో పది శాతం పనులు చేసి లబ్ధిదారుల ఎంపిక, రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టింది. భానోజీ కాలనీ టిడ్కో గృహ సముదాయంలో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని ఇళ్లకు తలుపులు లేవు. ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్కులు చేయలేదు. ఇళ్ల బ్లాక్‌ల మధ్య రోడ్డు లేకపోవడంతో ఖాళీ స్థలాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. తాగునీటి సౌకర్యం కోసం చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. దయాళ్‌నగర్ టిడ్కో గృహ సముదాయాలకు అప్రోచ్ రోడ్డు తప్ప వీధి రోడ్డు ఏర్పాటు చేయలేదు. రెండు ప్రాంతాల్లోనూ తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలు లేవు. కిటికీలకు గ్రిల్స్ లేవు. కాగా కొందరు లబ్ధిదారులు పగలంతా తమకు కేటాయించిన ఇళ్లల్లోనే ఉంటూ సాయంత్రం తాము ఉంటున్న అద్దె ఇళ్లకు వచ్చేస్తున్నారు.

స్పెషల్ బ్రాంచి ప్రక్షాళన

- ఒకేసారి 18 మంది బదిలీ
- నగర కమిషనర్ ఉత్తర్వులు



సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లోని స్పెషల్‌బ్రాంచి విభాగం ప్రక్షాళనపై సీపీ శంఖబ్రతబాగ్చి దృష్టిసారించారు. అందులో భాగంగా స్పెషల్‌బ్రాంచిలో పనిచేస్తున్న 18 మంది సిబ్బందిని మంగళవారం ఇతర విభాగాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

కమిషనరేట్‌లో స్పెషల్ బ్రాంచి విభాగం అతిముఖ్యమైనది. నగరంలో ఎక్కడ ఏం జరుగుతోంది?, పోలీసుల పనితీరు ఎలా ఉంది?, ప్రజలు ఏమనుకుంటున్నారు?, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఇతర సంఘాల వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయి...ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు, అధికారులు, నాయకులు పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను స్పెషల్‌బ్రాంచి ఎప్పటికప్పుడు సేకరించి పోలీస్ కమిషనర్‌కు నివేదిక అందజేస్తుంది. ఇందుకోసం ఒక అదనపు డీసీపీ, ఏసీపీ, నలుగురు సీఐలతో పాటు ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక ఏఎస్‌ఐ/హెడ్‌కానిస్టేబుల్/కానిస్టేబుల్ ఉంటారు. వీరంతా మఫ్టీలో తమ పరిధిలో తిరుగుతూ, వివిధ వర్గాల ద్వారా సమాచారం సేకరించి తమ పై అధికారుల ద్వారా సీపీకి చేరవేస్తుంటారు. అయితే స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న సిబ్బంది చాలా ఏళ్లుగా అక్కడే ఉండిపోవడం, గతంలో వివిధ పోలీస్ స్టేషన్లలో జనరల్ (స్టేషన్ ఆదాయ, వ్యయాలు చూడడం) విధులు నిర్వర్తించి ఉండడం వల్ల ఆయా స్టేషన్లలో జరిగే అవినీతి, అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా దాచిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం సీపీ దృష్టికి చేరడంతో ఒకేసారి 18 మందిని వేర్వేరు విభాగాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. హఠాత్తుగా ఒకేసారి అంతమందిని ఇతర విభాగాలకు బదిలీ చేయడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

29, 30 తేదీల్లో బెనారస్ ఎక్స్‌ప్రెస్ రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సౌత్ ఈస్ట్రన్ రైల్వే పరిధిలోని రూర్కెలా, జార్సిగూడ సెక్షన్‌లో భద్రతా నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 29న విశాఖ-బెనారస్ ఎక్స్‌ప్రెస్ (18311)ను, 30న బెనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18312) రైళ్లు రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అలాగే 29న రూర్కెలా, జగదల్‌పూర్ మధ్య నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు (18107/18108) రద్దు చేశామని పేర్కొన్నారు. కాగా ప్రయాణికుల సౌకర్యార్థం దన్‌బాద్-అలెప్పీ మధ్య నడుస్తున్న బొకారో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (13351/13352) ఈ నెల 26 నుంచి అదనంగా ఒక జనరల్ సెకండ్ క్లాసు సిట్టింగ్ కోచ్‌ను జత చేస్తున్నామని తెలిపారు.


ఉక్కులో ఫైర్ ప్రైవేటీకరణ

ఆసక్తి గల ఏజెన్సీల నుంచి బిడ్లకు ఆహ్వానం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గత నాలుగు దశాబ్దాలుగా ప్లాంటుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడ అగ్ని ప్రమాదం సంభవించినా రక్షణ, సహాయక చర్యలు చేపడుతున్న అగ్నిమాపక (ఫైర్ ఫైటింగ్) విభాగాన్ని ప్రైవేటీకరణ చేస్తోంది. వీటిని నిర్వహించగలిగిన సామర్థ్యం కలిగిన ఏజెన్సీలు ఎవరైనా ముందుకు రావాలని మంగళవారం ప్రకటన జారీచేసింది.

- 3 ఫైర్ స్టేషన్లు, 13 ఫైర్ ఇంజన్లు... 282 మంది సిబ్బంది
- శాశ్వత సిబ్బందిని తొలగించి ప్రైవేటుకు అప్పగించేందుకు సన్నాహాలు
- యాజమాన్యం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాల డిమాండ్
- వేలాది మంది పనిచేస్తున్న కర్మాగారంలో రక్షణ బాధ్యతలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం సముచితం కాదని వాదన



స్టీల్‌ప్లాంటులో ప్రధాన అగ్నిమాపక విభాగం

స్టీల్ ప్లాంటు వేల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అక్కడ వేలాది మంది నిరంతరం వివిధ పనుల్లో ఉంటారు. పరిపాలన, ఉత్పత్తి విభాగాలతో పాటు ఆస్పత్రి, కమ్యూనిటీ సెంటర్లు కూడా ఉన్నాయి. ఇది స్టీల్ ఉత్పత్తి చేసే పరిశ్రమ కావడంతో వివిధ రకాల ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంది. అందుకే అతి పెద్ద ఫైర్ ఫైటింగ్ విభాగం ఏర్పాటుచేశారు. ప్లాంటులో మూడు ఫైర్ స్టేషన్లు, 13 ఫైర్ ఇంజన్లు (అగ్నిమాపక వాహనాలు), వాటిలో పనిచేయడానికి 282 మంది శాశ్వత సిబ్బంది ఉన్నారు. ప్లాంటులో 2,744 ఫైర్ హైడ్రెంట్లు, 1,071 ఎక్స్‌టర్నల్ ఫైర్ హైడ్రెంట్లు, 86 మానిటరింగ్ కేంద్రాలు, 28 ఫైర్ ఫైటింగ్ పంప్ హౌస్‌లు ఉన్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు కొన్నిసార్లు మంటలను నీటితో కాకుండా ఫోమ్, రసాయనాలను ఉపయోగించి నియంత్రించాల్సి ఉంటుంది. దానికి తగిన ఏర్పాట్లు కూడా ఉన్నాయి. మంటలను అదుపుచేసే కార్బన్ డయాక్సైడ్ వాహనం, ఫోమ్‌తో కూడిన వాహనాలు ఉన్నాయి. ఇవికాకుండా వివిధ ప్రాంతాల్లో 14 వేల ఫైర్ ఎగ్జిటింగ్ విషర్లు ఏర్పాటుచేశారు. వీటిని ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది గత నాలుగు దశాబ్దాలుగా నిర్వహిస్తూ వస్తున్నారు. స్టీల్ ప్లాంటులోనే కాకుండా

... మిగతా 6వ పేజీలో

విషాదం

దైవ దర్శనానికి వెళుతుండగా ప్రమాదం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు
- శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన తల్లీ, కుమార్తె మృతి
- మరొకరు కూడా...

కంచిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):


ఒక్కగానొక్క కుమార్తెకు పాట్నా ఐఐటీలో సీటు రావడంతో కుటుంబ సభ్యులంతా సంతోషంగా సోమవారం రాత్రి కేక్ కట్ చేశారు. ఆ తర్వాత దైవదర్శనం కోసం కారులో ఒడిశా బయలుదేరినవారు... శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం చిన్న కొజ్జిరియా కూడలి వద్ద ప్రమాదం బారినపడ్డారు. ఈ ప్రమాదంలో తల్లీ, కుమార్తె సహా ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదానికి సంబంధించి కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.



నేహాగుప్తా (ఫైల్)



లావణ్య (ఫైల్)



సోమేశ్వరరావు (ఫైల్)

విశాఖ నగరంలోని సీతమ్మధారకు చెందిన ముత్తా వెంకటరంగ రాజేష్ గుప్తా కుమార్తె నేహా గుప్తా(18)కు పాట్నా ఐఐటీలో సీటు వచ్చింది. దీంతో రాజేష్, ఆయన భార్య లావణ్య (43), కుమార్తె నేహాగుప్తా, తల్లి సుబ్బలక్ష్మి, తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి చెందిన రాజేష్‌గుప్తా తోడల్లుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు (49), మరదలు రాధిక సోమవారం రాత్రి బీచ్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఇంటికి చేరుకున్నారు. వీరంతా మొక్కు తీర్చుకునేందుకు మంగళవారం వేకువజామున ఐదు గంటలకు విశాఖపట్నం నుంచి కారులో ఒడిశా రాష్ట్రం జాజ్‌పూర్‌లోని తరిణి మాత దేవాలయానికి

... మిగతా 6వ పేజీలో

భీమిలిలో భూ విలువల సవరణ వద్దు

» జడ్పీటీసీ వెంకటప్పడు వినతి



సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ వెంకటప్పడు

భీమునిపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భీమిలిలో భూముల మార్కెట్ విలువలు పెంచకుండా చర్యలు తీసుకోవాలని మండల జడ్పీటీసీ గాడు వెంకటప్పడు కోరారు. మంగళవారం భీమిలి సబ్ రిజిస్ట్రార్ హర్షవర్ధన్‌రెడ్డికి ఆయన వినతిపత్రం అందజేశారు.

అనంతరం అప్పటప్పుడు విలేకరులతో మాట్లాడుతూ జనవరి నుంచి ప్రభుత్వం రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలను పెంపుదల చేసే యోచనలో ఉందన్నారు. అయితే, ఇప్పటికే భీమిలి సబ్ రిజిస్ట్రార్ పరిధిలో వున్న భూములకు విలువలు అత్యధికంగా ఉందని, ఇప్పుడుమళ్లీ పెంచితే కొన్ని వర్గాలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయన్నారు. అధిక ధరలు ఉండడం వల్ల ఈ ప్రాంతంలో భూముల విక్రయాలు జరగక చిన్న, సన్నకారు రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలు గ్రహించి భీమిలికి ఉన్న పేరును చూసి మార్కెట్ విలువలు పెంచుకుంటూపోతే మరింత కష్టంగా ఉంటుందన్నారు. అందుకే ఈసారి భూముల మార్కెట్ విలువ పెంపును భీమిలి వరకు మినహాయించాలని కోరారు.

దీనిపై సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. సబ్ రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో సింగనబంధ సర్పంచ్ జీవీ నారాయణ, నాయకులు నీలాపు సూర్యనారాయణ ఉన్నారు.

సింహగిరిపై ట్రాఫిక్ జామ్



సింహాచలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయలకు సెలవు రోజులు కావడంతో మంగళవారం సింహాద్రినాథుని దర్శనానికి వేలాదిమంది సింహగిరికి తరలివచ్చారు. దీంతో ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు, రాకపోకలతో సింహగిరి బస్టాండ్, ప్రధాన రాజగోపురానికి ఎదురుగా ఉన్న రోడ్డులో వాహనాల ట్రాఫిక్ పలుమార్లు స్తంభించడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాంప్రసాద్ బాధ్యతల స్వీకరణ



నూతన ప్రిన్సిపాల్ రాంప్రసాద్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

భీమునిపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భీమిలి ప్రభుత్వ జూనియరు కళాశాల ప్రిన్సిపాల్‌గా పి.రాంప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లిమర్ల కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ కళాశాలకు ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా దుర్గాప్రసాద్ వ్యవహరించేవారు. నూతన ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మాట్లాడుతూ జనవరి 1, 2 తేదీల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థుల హాజరుశాతం పెంచి 2025 మార్చిలో జరుగబోవు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తామన్నారు. ఆయనను అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు.

విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలి: మధుకర్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ నేత మధుకర్ తదితరులు

పద్మనాభం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలని బీజేపీ రాష్ట్ర సంఘటనా మంత్రి ఎస్.మధుకర్ సూచించారు. పద్మనాభంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన వీరబాల్ దివస్‌లో ఆయన ప్రసంగించారు. ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి, స్వామి వివేకానంద, ఆజాద్ చంద్రశేఖర్, రాజగురు వంటి మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా జొరావర్ ఫతేసింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరబాల్ దివస్‌పై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్‌పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పుట్టా గంగయ్య, ఏపీ మెడికల్ విభాగం కన్వీనరు రూపాకుల రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ఆర్.శ్రీను, ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, యువమోర్చా అధ్యక్షుడు మహేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వీఎన్‌హెచ్-10 పశుగ్రాసం పెంపకంపై రైతుల ఆసక్తి

» గుజరాత్ నుంచి విత్తనాలు తెప్పించిన పశు సంవర్ధక శాఖ అధికారులు
» పాల దిగుబడిలో మెరుగైన ఫలితాలు
» గడ్డి సాగు చేసి కిలో రూ.15కు విక్రయిస్తున్న కర్షకులు



నగరపాలెంలో రైతులు పెంచుతున్న గుజరాత్ పశుగ్రాసం

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు గుజరాత్ పశుగ్రాసం పెంపకం పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఈ కొత్త రకం గడ్డి విత్తనాలను అధికారులు గుజరాత్ నుంచి ఇక్కడికి రప్పించారు. జిల్లాలో హనుమంతవాక, నర్సీపట్నం వద్ద పెదబొడ్డేపల్లి ప్రాంతాల్లో మొదటి సారి సాగు చేసిన ఈ గడ్డి నాణ్యత బాగుండడంతో ఇతర మండలాలకు కూడా పంపిణీ చేస్తున్నారు.

భీమిలి మండలంలోని తాటితూరు, నగరపాలెం, మజ్జివలస, మజ్జిపేట, లక్ష్మీపురం, తాళ్లవలస, దాకమర్రి, బోడమిట్లపాలెం, సింగనబంద గ్రామాల్లోని రైతులు ఈ గడ్డిని ఎక్కువగా పండిస్తున్నారు. ఇప్పటివరకు పశువుల పెంపకందారులు పిల్లి పెసర, కిత్తనార వంటి వివిధ రకాలకు చెందిన పశుగ్రాసం వినియోగిస్తున్నారు. వీటిని పశువులు ఇష్టంగా తినకపోవడం వల్ల పాల దిగుబడి కూడా అంతంత మాత్రంగా ఉంటోందని రైతులు చెబుతున్నారు.

తాజాగా.. వీఎన్‌హెచ్-10 పేరుతో ఉన్న గుజరాత్ గడ్డి విత్తనాలు వేస్తే పశుగ్రాసం ఏపుగా పెరగడంతో పాటు పశువులు కూడా ఇష్టంగా తింటున్నాయని రైతులు అంటున్నారు. పాల దిగుబడి కూడా పెరుగుతోందని చెబుతున్నారు. కేవలం నీరు తప్ప ఎలాంటి ఎరువులు అవసరం లేకపోవడంతో సాగు వ్యయం కూడా పెద్దగా ఉండడం లేదు.ఈ గడ్డి కిలో రూ.3 ఉంటుంది. రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పొలాల్లో మడుల మాదిరి చేసుకుని పెంచి అమ్మకాలు చేస్తే కిలో రూ.15 వరకు ఉంటుంది. దీంతో మండలంలో చాలా మంది పశువుల పెంపకందారులు ఈ గడ్డి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

బీచ్ కోతకు శాశ్వత పరిష్కారం చూపుతాం

» ఎమ్మెల్యే గంట శ్రీనివాస్



బోయవీధి వద్ద కోతకు గురవుతున్న తీరాన్ని పరిశీలిస్తున్న గంటా

భీమునిపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భీమిలిలో బీచ్ కోతకు గురి గాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన బోయవీధి, నోవాటెల్ తీరంలో మంగళవారం పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపానులు, వర్షాల సమయంలో తీరంలో ప్రజలు భయాందోళనలకు గురిగాకుండా జిల్లా కలెక్టర్, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ ఇంజనీర్లు తదితర అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీ సూచనలు, సలహాలు తీసుకుని ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఒకప్పుడు ఎంతో అందంగా ఉన్న భీమిలి తీరం హుద్‌హుద్ నుంచి కోతకు గురి కావడం మొదలైందని, అప్పటి నుంచి ఈ ప్రాంతంలో అందం, ఆహ్లాదం కరువవుతూ వస్తోందన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి 2026, జూన్‌లో ఫస్ట్ కమర్షియల్ ఫ్లయిట్ ఆపరేట్ ప్రారంభమవుతుందని, అప్పటిలోగా బీచ్‌రోడ్ విస్తరణ అవసరమన్నారు.

భీమిలిలో ప్రధాన రహదారి, బీచ్‌రోడ్డు, నరసింహస్వామి కొండ రోడ్డు విస్తరణ తప్పనిసరని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పునరుద్ఘాటించారు. మంగళవారం ఆయా రహదారులలో ఆయన పర్యటించి పరిస్థితిని ప్రజానాయకులకు, ప్రజలకు వివరించారు. ఈ రహదారుల అభివృద్ధితో భీమిలి ముఖచిత్రమే మారిపోతుందన్నారు. దేశంలోనే గర్వించదగిన బెస్ట్ టూరిజం పాలసీ తీసుకురానున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. నగరాన్ని, రుషికొండ ఐటీ సెజ్, భీమిలిలను కలుపుతూ పర్యాటకంగా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కాగా, గంటస్తంభం పరిశీలించి చూస్తుండగా రోడ్డు బురదగా ఉండడంతో గంటా జారి పడబోయారు. సెక్యూరిటీ అప్రమత్తమై పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది.

ఈ పర్యటనలో భీమిలి ఆర్డీవో కె.సంగీత్ మాధుర్, హెచ్‌డీటీ ఎస్.శ్రీనుబాబు, ఏసీపీ రామకృష్ణ, కూటమి నాయకులు గంటా నూకరాజు, గాడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం పూర్తి చేస్తాం

సాగర్‌నగర్ : పెద్దరుషికొండ స్వర్ణభారతినగర్‌లో అసంపూర్తిగా వున్న కల్యాణమండపాన్ని త్వరితంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం ఆయన కల్యాణ మండపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19లో తాను మంత్రిగా ఉన్నప్పుడు రూ40 లక్షల జీవీఎంసీ నిధులు, అప్పటి నుంచి కంభంపాటి హరిబాబు, మోపిదేవి వెంకటరమణల ఎంపి నిధులు నుంచి రూ.60 లక్షలతో ఈ కల్యాణ మండపాన్ని మొదలు పెట్టి 80 శాతం పనులను పూర్తి చేశామన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, జనసేన నేత శాఖరి శ్రీనివాస్, సారిపల్లి శ్రీనువాసరావు, లక్ష్మణరావు, జి. అప్పన్న, బీజేపీ నేత ఎల్లాజీ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

మధురవాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ఆహ్వాన పత్రికను మంగళవారం నగరంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు తదితరులు ఆవిష్కరించారు. 50 వసంతాల వేడుకలకు జిల్లా నలుమూలలు నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని మోహన్‌రావు కోరారు.

కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్, సంఘ నాయకులు ఎస్ఎస్ నాగమణి, టి.అప్పారావు, వైఆర్కే ప్రసాద్, ఎ.పైడిరాజు, రొంగలి ఉమాదేవి, కె.రాంబాబు, చుక్క సత్యం, ఉప్పాడ రాము, రియాజ్ అహ్మద్, టి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై భారీ వర్షం

సింహాచలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరిపై మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షాలు పడుతూనే ఉన్నాయి. దాంతో అప్పన్న ఆలయం తడిసి ముద్దైంది. విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవాలయంలో చండీయాగం వీక్షించిన తరువాత తిరుగు పయనమైన వేలాది మంది భవానీలు సింహగిరికి చేరుకోవటంతో వర్షంలో కూడా భక్తుల సంఖ్య తగ్గలేదు.

హెల్మెట్ ధరించడం ప్రాణావసరం

» రహదారి ప్రమాద బాధితుల్లో యువతే అధికం » వెనుక కూర్చున్న వారికీ రక్షణ తప్పనిసరి » గీతం సదస్సులో వక్తల ఉద్ఘాటన



మాట్లాడుతున్న గీతం ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్స్‌లర్ గౌతమ్‌రావు, వేదికపై ఇతర ప్రముఖులు

సాగర్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏటా 4.5 లక్షల రహదారి ప్రమాదాలు జరుగుతుండగా వాటిలో మరణిస్తున్న వారిలో అధిక శాతం మంది 18-25 సంవత్సరాల మధ్య యువత ఉంటున్నారని, దీనికి మితిమీరిన వేగం ప్రధాన కారణమని రహదారి భద్రతపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో నిపుణులు పేర్కొన్నారు. కె.జి.హెచ్‌కు చెందిన ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజూరీ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కె.అనిల్‌కుమార్, మెడికవర్ ఆసుపత్రి క్రిటికల్ కేర్ విభాగం అధిపతి డాక్టర్ మోహన్ మహరాజ్‌లు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. 60 శాతం ప్రమాదాలకు కారణం అతివేగమేనని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాలతో కుటుంబం, సమాజం, దేశంపై ప్రభావం పడుతోందన్నారు. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం వాహన చోదకుడితో పాటు వెనుక ఉన్న వారు హెల్మెట్ ధరించకపోవడం వల్ల 40 శాతం మంది తీవ్రంగా గాయపడుతున్నారని వారు తెలిపారు. రహదారి ప్రమాదంలో తలకు గాయాలైనవారు కోలుకోలేకపోతున్నారని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసరం అనుకుంటే తప్ప బాధితులను అంబులెన్స్ వచ్చే వరకు కదపకూడదని, వెన్నెముక జాగ్రత్తగా ఉండేలా చూసుకోవాలని, బాధితులకు ధైర్యం చెబుతూ కంగారు పడకుండా చూడాలని సూచించారు. ప్రమాద బాధితులను తక్షణమే ఆసుపత్రులకు తరలించడంలో స్థానికులు చొరవ తీసుకోవచ్చని, వారిని సమీప ఆసుపత్రిలో చేర్పినప్పుడు తిరస్కరించకుండా తక్షణ చికిత్స ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. గీతం ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ రహదారిపై ప్రయాణించే వారు బాధ్యతతో చట్టాలను గౌరవిస్తూ గమ్యాన్ని సురక్షితంగా చేరాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్న నిబంధన గీతం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అమలు చేస్తున్నామని తెలిపారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, సెక్యూరిటీ డైరెక్టర్ బిక్రమ్ పట్నాయక్, సెక్యూరిటీ హెడ్ రామాంజనేయులు, వివిధ విభాగాల ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

తర్లువాడలో లేగ దూడల ప్రదర్శన



పాడి రైతులకు బహుమతులు అందిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ

ఆనందపురం డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్లువాడ గ్రామంలో మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ సౌజన్యంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ బి.రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నేటి లేగదూడలే రేపటి పాడి పశువులుగా ఆయన పేర్కొన్నారు. లింగ నిర్ధారణ వీర్యం 60 శాతం రాయితీతో సమకూరుస్తామని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. బహువార్షిక పశుగ్రాసం పెంచుకున్నవారికి 100 శాతం రాయితీ ఉందని పేర్కొన్నారు. ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక మాట్లాడుతూ దూడలను శాస్త్రీయ పద్ధతిలో పెంచితే రైతుకు లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. ప్రదర్శనకు వివిధ గ్రామాల నుంచి మొత్తం 42 దూడ పెయ్యలు తీసుకువచ్చిన రైతులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, నాయుకులు మజ్జి వెంకటరావు, తాత్రాజు అప్పారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ సజ్జల శ్రీనివాసరావు, స్థానిక పశు వైద్యాధికారి పి.అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న కల్యాణం



కల్యాణం చేస్తున్న అర్చకస్వాములు

సింహాచలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు యధావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు.

అప్పన్న ఆలయంలో అమ్మవారి సేవ



అమ్మవారికి నీరాజనమిస్తున్న అర్చకులు



గోదాదేవి అలంకారం

సింహాచలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో అమ్మవారి సేవ వైభవంగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపారు. ఉత్సవమూర్తిని గోదాదేవిగా శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. భక్తుల గోవిందనామ సంకీర్తనలు, పండితుల వేదపఠనాలు, ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు నడుమ బేడామండప తిరువీధి ఘనంగా నిర్వహించారు. షోడశోపచారాలతో పూజలు చేసి అష్టదిక్పాలకులకు ప్రత్యేక అర్చనలు జరిపారు. ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో తిరుప్పావైలోని తొమ్మిదో పాశురాన్ని ముక్తకంఠంతో విన్నపాలు చేశారు. మంగళనీరాజనాలిచ్చిన తరువాత తీర్థగోష్ఠి ఏర్పాటు చేశారు.

వెంకన్న సన్నిధిలో గోదాదేవి అలంకరణ

ధనుర్మాసం సందర్భంగా సింహాచల దేవస్థానం అనుబంధ దేవాలయం కొండదిగువ అలిమేల్‌మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించిన తీరు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాల తరువాత గోదాదేవి అష్టోత్తర శతనామార్చన చేసి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చారు. తిరుప్పావై పాశుర విన్నపం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఒడిశా యువకుడి సైకిల్ యాత్ర



విశాలాక్షినగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం సంబల్‌పూర్‌కి చెందిన నంది ఘోష్ అనే యువకుడు చేపట్టిన భారతదేశ యాత్రలో భాగంగా మంగళవారం సీతకొండ వచ్చారు. అక్కడ మలుపులోని తీర ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటుండగా ఆంధ్రజ్యోతితో మాట్లాడాడు. ఈ నెల 6న సంబల్‌పూర్‌లో యాత్ర ప్రారంభించానని, 18 రోజుల్లో విశాఖ చేరుకున్నట్లు పేర్కొన్నాడు. యాత్ర ముఖ్య ఉద్దేశం రైట్ టు సైకిల్.. సేవ్ నేచర్ నినాదంతో యాత్ర చేపడుతున్నట్లు వివరించాడు. విజయవాడ, చెన్నై, రామేశ్వరం మీదుగా సైకిల్ యాత్ర కొనసాగుతుందని, పూర్తయ్యేసరికి ఏడాది సమయం పట్టే అవకాశం ఉందన్నాడు. రోజూ సుమారు 50 నుంచి 60 కిలోమీటర్ల దూరం యాత్ర చేపడుతున్నట్లు తెలిపాడు. రాత్రి వేళల్లో ఆలయాలు, సామాజిక భవనాల్లో విశ్రాంతి తీసుకుంటూ యాత్ర కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నాడు. ప్రజల విరాళాలతో యాత్ర చేపడుతున్నట్లు వివరించాడు. 2022 సెప్టెంబరు నుంచి 2024 ఏప్రిల్ వరకు యాత్ర చేశానన్నాడు.

విషాదం

... 5వ పేజీ తరువాయి

బయలుదేరారు. వారి వాహనం ఉదయం తొమ్మిది గంటల సమయంలో కంచిలి మండలం చిన్న కొజ్జిరియా సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొని బోల్తా పడింది. ఘటనా స్థలంలోనే లావణ్య మృతిచెందింది.

మిగిలిన క్షతగాత్రులను స్థానికులు 108 వాహనం, హైవే అంబులెన్స్‌లో సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో నేహా గుప్తా, సోమేశ్వరరావు మృతిచెందారు. రాధిక పరిస్థితి విషమంగా ఉండడంలో ఆమెను శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవ్ చేస్తున్న రాజేష్ గుప్తాకు, అతని తల్లి సుబ్బలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల మృతదేహాలను చూస్తూ రాజేష్ రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. లావణ్య, నేహా గుప్తా, సోమేశ్వరరావుల మృతదేహాలను సోంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

పరీక్షలు రాసేవిధంగా చూడనున్నారు. గత ఏడాది వరకూ మధురవాడ విద్యార్థులకు సిటీలో, గాజువాక విద్యార్థులకు పెందుర్తిలో సెంటర్లు కేటాయించే వారు. ఈ ఏడాది అటువంటి సమస్య లేకుండా విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పరీక్షల నిర్వహణకు సన్నహాలు

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఫర్నిచర్, విద్యుత్, పరిశుభ్రమైన గదులు, మరుగుదొడ్లు వంటి పూర్తిస్థాయి మౌలిక వసతులు కలిగిన జూనియర్ కళాశాలలను గుర్తించారు. 2023-24 ఏడాదిలో 93 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈసారి ఒకటి, రెండు కేంద్రాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో 188 కళాశాలల నుంచి 82,899 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం నుంచి 42,228, ద్వితీయ సంవత్సరం నుంచి 40,671 మంది ఉన్నారు. రవాణా సౌకర్యం లేని గాజువాకలోని విశాఖ డిఫెన్స్ అకాడమీ, మౌలిక వసతులు లేనందున అగనంపూడి, మధురవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను పరీక్షల కేంద్రాల నుంచి తప్పించారు.

పరీక్షా కేంద్రాలకు నో అంటున్న కార్పొరేట్ కళాశాలలు...

జిల్లాలోని కొన్ని కార్పొరేట్ జూనియర్ కళాశాలలు తమ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అంగీకరించడం లేదని తెలిసింది. సాధారణంగా కార్పొరేట్ కళాశాలలు ఇంటర్ విద్యతో పాటు, ఎంసెట్, ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటాయి. మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు ఉన్నందున ఆయా రోజుల్లో తమ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం కుదరదనే పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు ససేమిరా అంటున్నట్టు సమాచారం.

జోన్‌ల వారీగా...: ఆర్ఐవో మురళీధర్

ఈ ఏడాది నుంచి జోన్లవారీగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. మౌలిక వసతులు కలిగిన కాలేజీలను ఎంపిక చేసి గదుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఉక్కులో ఫైర్ ప్రైవేటీకరణ

... 5వ పేజీ తరువాయి

హెచ్‌పీసీఎల్, పోర్టు, ఫార్మా సిటీ వంటి పరిశ్రమల్లో భారీ ప్రమాదాలు సంభవించినప్పుడు స్టీల్ ప్లాంటు అగ్నిమాపక శకటాలు వెళ్లి సహాయ సహకారాలు అందిస్తున్నాయి. ప్లాంటుతో పాటు ఉద్యోగులు నివసించే టౌన్‌షిప్, హిల్‌టాప్ గెస్ట్‌హౌస్, ఆస్పత్రి, స్కూళ్లు, పోస్టాఫీసులు, ఇతర భవనాలకు కూడా వీరు రక్షణ కల్పించాల్సి ఉంది. ఈ విభాగంలో పనిచేసే వారు ప్లాంటుకు చెందిన శాశ్వత సిబ్బంది కాబట్టి ఎటువంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురైనా ప్రాణాలకు తెగించి రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఇప్పుడు దీనిని ప్రైవేటీకరణ చేస్తే...కాంట్రాక్టుకు పనిచేసే సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి స్టీల్‌ప్లాంటు ఆస్తులను, మనుషులను కాపాడతారా?...అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇంత పెద్ద కర్మాగారం రక్షణ బాధ్యతలను ప్రైవేటుకు అప్పగించడం సముచితం కాదని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పైగా ఈ ఫైర్ ఫైటింగ్ విభాగంలో ఉన్న వనరులన్నీ ప్రైవేటు ఏజెన్సీకి ఇచ్చి, కేవలం కాంట్రాక్టు సిబ్బందితో నిర్వహించాలని కోరడం ఏ విధంగా ఆమోదయోగ్యం కాదనే వాదన గట్టిగా వినిపిస్తోంది.

ఇది దుర్మార్గం..వెనక్కి తీసుకోవాలి

అయోధ్యారామ్, సీఐటీయూ నాయకులు

యాజమాన్యం ప్లాంటుకు అవసరమైన ముడి పదార్థాలు ఎలా తేవాలి?, ఉత్పత్తి ఎలా పెంచాలి?, మార్కెటింగ్ ఏ విధంగా బలోపేతం చేయాలనే అంశాలపై దృష్టి పెట్టకుండా ఉద్యోగుల సంఖ్య తగ్గించడంపైనా, ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటీకరణ చేయడంపైనా కసరత్తు చేస్తోంది. ఇది దుర్మార్గమైన చర్య. దీని కోసం విడుదల చేసిన ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకోవాలి.

వైసీపీ నిర్లక్ష్యం.. పేదలకు శాపం

... 5వ పేజీ తరువాయి

3,47,284 మంది దరఖాస్తు చేసుకోగా 2,03,438 మందిని అర్హులుగా గుర్తించారు. అందులో సొంత స్థలాలు కలిగి ఉన్న 8,262 మందికి బీఎల్‌సీ (లబ్ధిదారుడే నిర్మించుకోవడం) కింద పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేయాలని నిర్ణయించారు. స్థలాలు లేని వారికి 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఫ్లాట్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 300 చదరపు అడుగులు కోసం రూ.25 వేలు, 365 చదరపు అడుగుల ఫ్లాట్ కోసం రూ.50 వేలు, 430 చదరపు అడుగుల ఫ్లాట్‌కు రూ.లక్ష డీడీలు తీయాలని ప్రభుత్వం సూచించింది. అర్హులుగా తేలిన వారిలో 43,844 మంది డీడీలు తీసి జీవీఎంసీ యూసీడీ అధికారులకు అందజేశారు.

జీవీఎంసీ పరిధిలో 55 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంగివలస, బక్కన్నపాలెం, కొమ్మాది, దబ్బంద, అచ్చింనాయుడులోవ, ములగాడ, ట్రైజంక్షన్, దువ్వాడ, భానోజీతోట, అగనంపూడి, బర్మా కాలనీ, తలారివానిపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి, కొండకొప్పాక, సిరసపురం, సత్యనారాయణపురం, రాతిచెరువు, చినముషిడివాడ, చీమలాపల్లి, పరవాడ, అప్పికొండ, నడుపూరు, లంకెలపాలెం వంటి ప్రాంతాల్లో భూసేకరణ చేశారు. వీటితోపాటు సుద్దగెడ్డ, ఆదర్శనగర్, చిలకపేట, సీహార్స్ జంక్షన్, రాజీవ్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ముత్యాలమ్మకాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, గౌరీనగర్, ఏఎస్ఆర్ నగర్‌లలో మురికివాడలను తొలగించి అదే స్థలంలో 1,256 ఫ్లాట్లు చొప్పున నిర్మించాలని ప్రణాళికరూపొందించారు. మొత్తం 31 లేఅవుట్లలో 24,192 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. 2019 మార్చి నాటికి నాలుగు వేల ఇళ్ల నిర్మాణం పూర్తికావడంతో లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయించారు.

అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ...గతంలో జరిపిన కేటాయింపులను రద్దు చేసింది. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయంటూ మళ్లీ దరఖాస్తులు ఆహ్వానించింది. సర్వే పేరుతో వడపోసి గత ప్రభుత్వ హయాంలో అర్హులుగా గుర్తించిన వారిలో 13,761 మందిని అనర్హులుగా తేల్చి, 30,083 మందిని మాత్రమే అర్హులుగా నిర్ధారిం చింది. జీవీఎంసీ పరిధిలో 24,192 ఇళ్ల నిర్మాణం మాత్రమే జరుగుతుండడంతో వాటికి మాత్రమే లబ్ధిదారులను లాటరీ ద్వారా 2020లో ఎంపిక చేసింది.

మిగిలిన వారికి జగనన్న లేఅవుట్లలో సెంటు చొప్పున స్థలాన్ని కేటాయిస్తామని చెప్పిం ది. 300 చదరపు అడుగుల ఫ్లాట్‌ను లబ్ధిదారులకు ఉచితంగా అందజేస్తామని, 365 చదరపు అడుగుల ఫ్లాట్‌కు రూ.50 వేలుకాకుండా రూ.25 వేలు, 430 చదరపు అడుగుల ఫ్లాట్‌కురూ.లక్షకు బదులుగా రూ.50 వేలు చెల్లించాలని ప్రకటించింది.

ఐదేళ్లలో అడుగు ముందుకుపడని పనులు

2019లో వైసీపీ అధికారం చేపట్టినప్పుడు ఏడాదిలోగా ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించి లబ్ధిదారులకు అప్పగిస్తామని ప్రకటించింది. కానీ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించింది. టీడీపీ హయాంలో నిర్మాణం పూర్తయిన సముదాయాలకు ఉన్న రంగులను మార్చి వైసీపీ జెండాను పోలిన రంగులను వేయించింది. నిర్మాణం చివరి దశలో ఉన్న వాటిని పూర్తి చేయడానికే పరిమితమైంది. ఐదేళ్లలో కేవలం 7,456 మంది లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లను అప్పగించింది. వీటిలో చాలా చోట్ల కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఆయా ఇళ్లలో దిగడానికి ఆసక్తి చూపలేదు. కేవలం నాలుగు వేలలోపు ఇళ్లలో మాత్రమే నివాసాలు ఉంటున్నారు.

టిడ్కో ఇళ్ల పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థలకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు పనులను నిలిపివేశారు. దాంతో చాలాచోట్ల టీడీపీ హయాంలో ఎక్కడ వరకూ పనలుఉ జరిగాయో... వైసీపీ అధికారరీ నుంచి దిగిపోయేసరికి కూడా అదేస్థాయిలో ఉండిపోయాయి. ఐదేళ్ల పాటు నిర్మాణపనులు నిలిచిపోవడంతో పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. బక్కన్నపాలెంలోని టిడ్కో సముదాయాలు మందుబాబులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి.

చీమలాపల్లిలో మొండిగోడలతోనే నిర్మాణాలు నిలిచిపోయాయి. టిడ్కో ఇళ్ల నిర్మాణంపై ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించి తిరిగి పనులు ప్రారంభించాలనే యోచనలో ప్రభుత్వం ఉందని టిడ్కో అధికారులు పేర్కొంటున్నారు.

పండగకు ఊరెళితే సమాచారమివ్వండి: ఎస్‌ఐ

పెందుర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు ఇంటికి తాళం వేసి ఊరెళ్తే లాకడ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)యాప్ వినియోగించాలని పెందుర్తి ఎస్‌ఐ డి.సూరిబాబు పేర్కొన్నారు. ఊరు వెళ్తున్న వారు పోలీసులకు సమాచారమిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా ఇంట్లో నిఘా కెమెరాలు అమర్చుతామన్నారు. బంగారు ఆభరణాలు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. నగలు ధరించే మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమనాస్పదంగా సంచరించే అపరిచితుల సమాచారాన్ని అందించాలన్నారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలివ్వండి

పెదగంట్యాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు బకాయి జీతాలను తక్షణమే చెల్లించాలని గాజువాక సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి. సత్యనారాయణ డిమాండ్ చేశారు. పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవనంలో మంగళవారం పి.దుర్గారావు అధ్యక్షతన సీపీఐ సమితి సమావేశం జరిగింది. జీతాలు లేక ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు అవస్థలకు గురవుతున్నారన్నారు. తక్షణమే ఉక్కు యాజమాన్యం స్పందించాలన్నారు. జి.ఆనంద్, పోతన్న, పోలయ్య, అచ్యుతరావు, విష్ణుమూర్తి, సోమేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు



ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 800 మందికి అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

బొర్రమాంబకు ఆలయంలో

అగనంపూడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలితా, విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు పాల్గొన్నారు.

జాకీర్ హుస్సేన్‌కు నివాళి

గోపాలపట్నం, డిసెంబరు 24: ఇటీవల మృతి చెందిన ప్రముఖ తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్‌కు మంగళవారం గోపాలపట్నం కళా సేవా పీఠం సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. పీఠం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో సభ్యులు హుస్సేన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంగీత ప్రపంచానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
● **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
● **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
● **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 26, వంకాయలు(తెలుపు) 38, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ20, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 24, క్యారెట్ 42 దొండకాయలు 46, బంగాళదుంపలు 29, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 140, అల్లం 56, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి 300, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 60, కీరదోస 36, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడ దుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 42, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.


కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం



బాజీజంక్షన్ లక్ష్మీనగర్‌లో విద్యుత్ కాంతులతో సేవియర్ లూథరన్ చర్చి

» చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
» విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరణ



వేపగుంట ముత్యమాంబకాలనీలో బైబిల్ మిషన్ సమృద్ధి గృహ చర్చి

ఎన్ఏడీ జంక్షన్/ వేపగుంట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధమయ్యాయి. విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. బాజీజంక్షన్, బుచ్చిరాజుపాలెం, ఎన్ఏడీ జంక్షన్, నాయుడుతోట, వేపగుంట చర్చిలను ఇప్పటికే అందంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. బాజీజంక్షన్ లక్ష్మీనగర్‌లోని సేవియర్ లూథరన్ చర్చి ఆకట్టుకుంటుంది. బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ చర్చి, ఎన్ఏడీ సెయింట్ లూథరన్ చర్చి, కరాస పెంతకోస్తు చర్చిల్లో ప్రార్థనలు, కూటమిలు నిర్వహించనున్నారు. వేపగుంట ముత్యామాంబ కాలనీలోని బైబిల్ మిషన్ సమృద్ధి గృహ చర్చిలో బుధవారం సాయంత్రం నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొంటారు.



పెందుర్తిలోని చర్చికి విద్యుత్ దీపాల అలంకరణ

విద్యుత్ దీపాలతో అలంకరణ

పెందుర్తి: మండలంలో కిస్మస్ సందడి నెలకొంది. పండగను ఉత్సాహంగా జరుపుకునేందుకు క్రైస్తవులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చినముషిడివాడ శాంతినగర్ ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. పెందుర్తి, చినముషిడివాడ, వి.జుత్తాడ చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

'తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక'



ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని 86 వార్డు టీడీపీ ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. మాతృశ్రీ నగర్‌లో కాలనీలో మంగళవారం రాత్రి నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంలో ఒక్క 86 వార్డులోనే 4,500 సభ్యత్వాలను నమోదు చేసినట్టు వివరించారు. రూ.100 సభ్యత్వ నమోదుతో కార్యకర్తతో పాటు కుటుంబానికి బీమా సదుపాయం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, కండిపల్లి అర్జున్, జగదీష్, నాగార్జున,వెంకట సుబ్బయ్యలోవరాజు తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి'

మల్కాపురం: కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని దశ,దిశ అందిస్తోందని, అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు కృషి చేస్తోందని నాయకులు తెలిపారు. అధికారులు అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా చొరవ చూపాలని కోరారు. గ్రేటర్ 59వ వార్డులో మంగళవారం వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ నేత పి.జయరాజు ఆధ్వర్యంలో మాజీ సైనికుల కాలనీలో అంబేద్కర్ భవనం అభివృద్ధి పనులను పరిశీలించారు. వివిధ వర్గాల ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) ఆదేశాల మేరకు వార్డులో పర్యటిస్తున్నామన్నారు. టీడీపీ నేతలు మితిరెడ్డి శంకర్, పొత్తబత్తుల శ్రీను, బీజేపీ నాయకులు గురుమూర్తి, పొలిమేర శ్రీను, సతీష్, లక్కరాజు, రామకృష్ణ, పైడిరాజు, వరప్రసాద్, వెంకట్రావు పాల్గొన్నారు.

జాతీయ నెట్‌బాల్ పోటీలకు కణితి విద్యార్థులు



కోర్బా బయలుదేరిన కణితి ఉన్నత పాఠశాల విద్యార్థులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి మూడు రోజులు పాటు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం కోర్బాలో నిర్వహించనున్న జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు బయలుదేరారు. ఎస్‌జీఎఫ్ (స్కూలు గేమ్స్ ఫెడరేషన్) అండర్-14 బాలికల పోటీలకు 9 తరగతి విద్యార్థులు హేమదుర్గ, హారిక, దేవి, అండర్-14 బాలుర జట్టుకు యశ్వంత్ (9వ తరగతి), గీతా గౌతమ్ (8 తరగతి), అండర్-19 బాలికల పోటీలకు కళ్యాణి (9వ తరగతి)ఎంపికయ్యారు. కోచ్ నారాయణ, మన్నాజీ, మేనేజర్ వి.దేముడుబాబు సారథ్యంలో జట్టు బయలుదేరినట్టు ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశ్ తెలిపారు.

కమ్యూనిటీహాల్ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 62వ వార్డు పరిధి క్రాంతీనగర్‌లో శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక భవనం శిథిలావస్థలో ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని, స్థానికుల విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ నిధులతో కొత్త భవనం నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ రమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

అగనంపూడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లి పేర్కొన్నారు. తలారివానిపాలెంలో మంగళవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూముల పరంగా ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరించుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. పలువురు దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మధుసూదనరావు, స్థానిక నాయకులు కర్రి దోశేంద్ర, ఇల్లపు ప్రసద్, సత్యనారాయణ, చందు. అప్పారావు, తాతారావు, పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం

పెందుర్తి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చే సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష కోరారు. మండలంలోని రాంపురంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు హాజరై ప్రాధాన్యత వివరించారు. రైతులు భూసంబంధిత సమస్యల పరిష్కారానికి దోహదపడతాయన్నారు. ఎన్‌హెచ్ 16 ఎస్‌డీసీ జె.సీతారామారావు 50 అర్జీలను స్వీకరించారు. ఆర్ఓఆర్ సంబంధిత దరఖాస్తులు 24, ఎఫ్ లైన్ దరఖాస్తులు 22, ఆక్రమణలపై నాలుగు వినతులందాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు హిమబిందు, జామి గంగునాయుడు, వెన్నెల సన్యాసినాయుడు పాల్గొన్నారు.



తహసీల్దార్ శ్రీవల్లికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

'ఉక్కు ఉద్యోగులకు జీతాల బకాయిలు చెల్లించండి'



మాట్లాడుతున్న కసిరెడ్డి సత్యనారాయణ

పెదగంట్యాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు మూడునెలలుగా ఉన్న బకాయిలు జీతాలను తక్షణమే చెల్లించాలని గాజువాక సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పెదగంట్యాడలో మంగళవారం పి.దుర్గారావు అధ్యక్షతన గాజువాక నియోజక వర్గ సీపీఐ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, జీతాలు లేక ఉక్కు ఉద్యోగులు కుటుంబాలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. తక్షణమే ఉక్కు యాజమాన్యం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, పోతన్న, పోలయ్య, అచ్యుతరావు, విష్ణుమూర్తి, సోమేశ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

అగనంపూడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్డు పరిధి పాతఅగనంపూడి, శ్రీనివాస్‌నగర్, అన్నపూర్ణనగర్, శాంతినగర్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. నివాసితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు మాడిశ వెంకటరావు, సింగిడి సింహాచలం, సుబ్బరాజు. నాగేశ్వరరావు, రుద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

» ఐలా 20వ సర్వసభ్య సమావేశంలో తీర్మానం

ఆటోనగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సభ్యులు తీర్మానించారు. ఐలా 20వ వార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం రాత్రి ఐలా కార్యాలయంలో జరిగింది. చైర్మన్ రఘు (సత్యనారాయణ రెడ్డి) వార్షిక బడ్జెట్‌ను చదివి వినిపించారు. ఆటోనగర్ రైల్వే వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నాయని పదినెలల్లో అందుబాటులోనికి వస్తుందన్నారు. పరిశ్రమలకు నాణ్యమైన భూగర్భ ఎలక్ట్రికల్ కేబుల్ నెట్‌వర్కు పనులు ప్రారంభించామన్నారు. 113 కేవీ భూగర్భ సబ్‌స్టేషన్ కోసం 3.38 ఎకరాలను అపెరెల్ పార్కులో కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. అభివృద్ధి పనులకు రూ.814.00 లక్షలు కేటాయించారని, టెండరింగ్ దశలో ఉన్నాయన్నారు. ఏపీఐఐసీ ఇన్‌చార్జి జెడ్ఎం బి.హరిధరరావు మాట్లాడుతూ ఐలా అభివృద్ధికి ఏపీఐఐసీ సహకరిస్తోందన్నారు. ఐలా కమిషనర్ ఎ.కిశోర్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నూతన రహదారుల నిర్మాణం, కాలువలు, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరిశ్రమలకు నీటి సరఫరా, డ్రైన్లు, విద్యుద్దీపాలపై చర్చించారు. ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలు తమ బ్లాకులలో తెలిపిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, కోశాధికారి పి.పద్మావతి మాట్లాడుతూ ప్రాపర్టీ ట్యాక్స్, బిల్డింగ్ ప్లాను, మెయింటిన్స్ నిర్వహణపై ఆదాయ, వ్యయాలను వివరించారు. సమావేశంలో ఐలా మాజీ చైర్మన్లు యార్లగడ్డ సాంబశివరావు, శేషగిరిరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రామకృష్ణంరాజు, వేములపల్లి కిశోర్, వాసివా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, పారిశ్రామికవేత్తలు ఏకె బాలాజీ, కొల్లి సత్యనారాయణ, లంక బాపిరాజు, ఇ.కృష్ణప్రసాద్, అట్లూరి రమేశ్, దామినేని శ్రీనివాస్, రామప్రసాద్, పరుచూరి ప్రభాకర్, కుమార్‌రెడ్డి, అంబిక, విశాలాక్షి, నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐలా చైర్మన్ రఘు, పాల్గొన్న ప్రతినిధులు

అధిక పింఛన్ అందేలా చూడండి



ఎంపీ శ్రీభరత్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ పెన్షనర్లు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అధిక పింఛన్ల మంజురులో పీఎఫ్ ఆర్గనైజేషన్ చేస్తున్న అనవసర జాప్యంపై జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరుతూ ఎంపీ శ్రీభరత్‌కు స్టీల్‌ప్లాంట్ పెన్షనర్ల సంఘం సభ్యులు మంగళవారం ఎంపీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా 2022 నవంబరులో సుమారు రెండువేల మంది సభ్యులు పీఎఫ్ కార్యాలయానికి సుమారు రూ.400 కోట్లు చెల్లించినా అధిక పింఛను మంజురు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని వివరించారు. సమస్యను పరిష్కరించేలా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ప్లాంట్ అధికారుల సంఘం అధ్యక్షుడు కేవీడీ ప్రసాద్, పింఛనర్లు పాల్గొన్నారు.

అనకాపల్లి ఎంపీ దృష్టికి ఉక్కు సమస్యలు



ఎంపీ సీఎం రమేశ్‌కు సమస్యలు వివరిస్తున్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలు, ఉద్యోగుల సమస్యలను అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ దృష్టికి ఉక్కు పోరాట కమిటీ నాయకులు తీసుకువెళ్లారు. విశాఖ విమానాశ్రయంలో పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, నాయకులు వెన్నా శ్రీరామ్మూర్తి ఎంపీని మంగళవారం కలిసి స్టీల్‌ప్లాంట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులను వివరించారు. ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు ఇవ్వటం లేదని తెలిపారు. ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని పూర్తిగా విరమించుకోవాలన్నారు. ఫ్యాక్టరీ ప్రగతికి కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్లాంట్ వృద్ధిలోకి రావాలని, మంచి లాభాల్లో నడవాలని కోరుతూ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి కర్పూర హరతి, నీరాట్ల ఉత్సవము, కూడారై ఉత్సవాలు, ముక్కోటి ఏకాదశి, శ్రీగోదారంగనాథుల కల్యాణం చేయనున్నట్టు అర్చకులు, నిర్వాహకులు తెలిపారు.

వెంకటాద్రిపై ప్రత్యేక పూజలు

పెందుర్తి: వెంకటాద్రి శిఖరంపై గల ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి, స్వామి మూలవిరాట్టుకు మంగళవారం విశేష అలంకరణలు చేసి, హారతులిచ్చారు. గోదాదేవి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం తిరుప్పావై పఠించి ఎనిమిదో పాశురాన్ని నివేదించారు.సరిపల్లి రామాలయంలో భక్తబృందం సీతారాముల కీర్తనలతో మేలుకొలుపు చేశారు.

గోతిలో పడిన వాహనం: తప్పిన ప్రమాదం



గోతిలో దిగిపోయిన వ్యాన్

మల్కాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి ఎదురుగా పైప్‌లైన్ ఏర్పాటుకు తవ్వుతున్న గోతిలో...ఇటుకలతో వస్తున్న వాహనం దిగిపోయింది. త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో ఈ వాహనం మల్కాపురం నుంచి గాజువాక ఆర్టీసీ డిపోవైపు వెళ్తుండగా శ్రీహరిపురం ఆస్పత్రి వద్దకు వచ్చేసరికి మరో వాహనాన్ని దారి ఇచ్చే ప్రయత్నంలో బాగంగా గోతిలో కూరుకుపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి నానిపోవడంతో గొయ్యి పెద్దదయింది. అయితే వాహనం బోల్తా పడకపోవడంతో ప్రమాదం తప్పింది. దీనిని సత్వరం పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీ నేత మధుకర్‌ను కలిసిన 'కరణంరెడ్డి'



మధుకర్‌తో కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మధుకర్‌ని మంగళవారం గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు విశాఖ పార్టీ కార్యాలయంలో కలిశారు. గాజువాకలో రికార్డు స్థాయిలో పార్టీ సభ్యత్వాలను నమోదు చేసినట్టు ఈ సందర్భంగా ఆయనకు వివరించారు.నాయకులు, కార్యకర్తల సహకారంలో పార్టీని బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, జగదీష్, రంగనాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ వితరణ



ట్రై సైకిల్ అందిస్తున్న దృశ్యం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సేవే పరమ విధిగా సత్యసాయి సమితి ముందుకు సాగుతుందని స్టీల్‌ప్లాంట్ సమితి కన్వీనర్ జి.రామకృష్ణ అన్నారు. సత్యసాయి శత జయంతోత్సవాల సందర్భంగా మంగళవారం నమ్మిదొడ్డి గ్రామంలో స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుడికి బ్యాటరీ ట్రై సైకిల్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవసరం ఉన్న వారికి సేవ చేయటమే లక్ష్యమన్నారు. దత్తత గ్రామమైన నమ్మిదొడ్డి ప్రజలకు అన్ని విధాల సహాయపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఈశ్వరి, ఆర్ఏ.నాయుడు, సోమేశ్వరి పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

విశాఖపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మోల్ బయో డయోగ్నోస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్, హెల్ప్ ది హెల్ప్‌లెస్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గాజువాకలోని వందే భారత్ బ్లడ్ సెంటర్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 65 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ మోల్ బయో డయాగ్నోస్టిక్స్ జీఎం ఉదయ్ భాస్కర్ అభినందించారు. కంపెనీ ఉద్యోగులకు ట్రస్ట్ చైర్మన్ ప్రభుదాస్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సత్యజిత్రే, వందే భారత్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి, రక్తదాన ఉద్యమ కర్త వినోద్ బాలు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మెము పాసింజర్ రైళ్లు తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ పనుల నేపథ్యంలో పలు మెము పాసింజర్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 28 వరకు రాజమండ్రి-విశాఖ (07466), విశాఖ-విజయనగరం (07468), ఈనెల 27 నుంచి మార్చి 1 వరకు విశాఖ-రాజమండ్రి (07467), విజయనగరం-విశాఖ (07469), విశాఖ-పలాస (07470), పలాస-విశాఖ పాసింజర్ (07471) రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు.

అన్నసమారాధనకు 50 రోజులు



దీక్షాధారులకు వడ్డిస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే న్యూకాలనీలోని ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో మాల ధరించిన స్వాములకు ఏర్పాటు చేసిన అన్న సమారాధన మంగళవారం 50వ రోజుకు చేరుకుంది. ఇప్పటి వరకూ సుమారు 11 వేల మంది స్వాములకు అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. 14 ఏళ్ల నుంచి బాబా నిత్యాన్నదానాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే మూడేళ్ల నుంచి మాల ధరించిన స్వాములకు అన్న సమారాధన కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. కుటుంబంలో జరిగే వివాహ, జన్మదినం లేదా పెద్ద జ్ఞాపకార్థం, ఇతర ఏ శుభకార్యాలకు బాబా నిత్యాన్న ప్రసాదం సమకూరుస్తామన్నారు. రెండేళ్ళుగా ఆకలితో ఉన్న ప్రతి ఒక్కరికీ ధ్యానమందిరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్రిడ్జ్‌లో ఆహారం 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

ఘాట్ రోడ్డు వద్ద పోలీసు గస్తీ



గస్తీలో వన్‌టౌన్ పోలీసులు

పూర్ణామార్కెట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణ స్వామి ఘాట్ రోడ్డు పూర్ణామార్కెట్ వైపు మార్గంలో పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో అర్ధరాత్రి మందుబాబుల ఆగడాలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీనిపై వన్‌టౌన్ సీఐ దేముడుబాబు స్పందించారు. మంగళవారం రాత్రి నుంచి ఘాట్ రోడ్డు మార్గంలో పోలీస్ గస్తీ ఏర్పాటు చేయించారు. ఆకతాయిల వల్ల ఇబ్బందులుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. రాత్రి గస్తీ ఏర్పాటు చేయడాన్ని వ్యాపారవర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మవారిగుడి వద్ద మురుగుకాలువల శుభ్రత

జగదాంబ కూడలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి గుడి పరిసరాల్లో మురుగునీటి ఇబ్బందులను జోన్ 4 కమిషనర్ మల్లయ్యానాయుడు పరిశీలించారు. మంగళవారం రాత్రి రీడింగ్ రూమ్ నుంచి అమ్మవారి గుడికి ఇరువైపుల కాలువల ద్వారా పారుతున్న మురుగునీటి ఇబ్బందులు తొలగించే చర్యలు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను పారిశుధ్య, ప్రజారోగ్య విభాగం సిబ్బంది తొలగించారు. కనకమహాలక్ష్మి ఆలయ సందర్శనార్థం మేయరు హరి వెంకటకుమారి విచ్చేసిన నేపథ్యంలో గుడి ప్రధాన ద్వారం వద్ద మురుగునీరు రోడ్డుపై పారుతున్న విషయాన్ని తెలుసుకున్న జోనల్ కమిషనర్ మల్లయ్యానాయుడు వెంటనే స్పందించి శుభ్రత చర్యలు తీసుకున్నారు.

వడ్లమూడి సేవలు అనన్యం



వడ్లమూడి బ్రహ్మానందరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గురుద్వార వద్ద గల ఓ హోటల్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ స్మారక కేంద్రం వార్షికోత్సవ సభను మంగళవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రం స్థాపనకు వడ్లమూడి రామ్మోహనరావు చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఈ సందర్భంగా వడ్లమూడి బ్రహ్మానందరావును ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సన్మానించారు. శివాజీ మెమోరియల్ కమిటీ కార్యదర్శి రఘురామయ్య, డాక్టర్ వడ్డి విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగి అప్పగింత

టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న అరకుకు చెందిన మానసిక రోగి కాంతమ్మ (70)ను ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వైజాగ్‌లో ఉన్న కూతురు, అల్లుడు దగ్గరకు వచ్చి తగాదా పడి కలిసి ఉండకుండా రైల్వేస్టేషన్‌లో భిక్షాటన చేస్తూ జీవనం గడుపుతుండగా సంరక్షించామన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం



విద్యుత్ దీపాలంకరణలో సెయింట్ ఆంథోని చర్చి



క్రిస్మస్ వేడుకల్లో కేకు కోస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఇతర అతిథులు

మహారాణిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలు జోరందుకున్నాయి. బుధవారం క్రిస్మస్ పర్వదినం నేపథ్యంలో నగరంలోని చర్చిలను విద్యుత్ దీపాలతో సొబగులద్దారు. నగరంలోనే అత్యంత పురాతనమైన వందేళ్ల చరిత్ర కలిగిన మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ చర్చిలో మంగళవారం రాత్రి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. చర్చి లోపల ఏసుక్రీస్తు క్రిబ్‌ను ఏర్పాటు చేసి ప్రార్థనలు నిర్వహించారు.

సీతమ్మధార, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార ప్రధాన రహదారిలో ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఎదురుగా గల బాలయేసు చర్చ్‌లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేసినట్లు చర్చ్ ఫాదర్స్ తెలిపారు. చర్చ్‌ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. రాత్రి 12 గంటలు దాటాక చర్చ్‌లో బాలయేసు ప్రతిమను ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించారు.



సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో..

జ్ఞానాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో పశువుల పాక, పొత్తిళ్లలో బాల యేసు సెట్‌ను అందంగా దీపాలతో అలంకరించారు. విద్యార్థులు శాంతాక్లాజ్‌తో కలసి జంగిల్ బెల్స్ పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, పలువురు సిస్టర్లు పాల్గొన్నారు.

పరోపకారంతో ఆత్మసంతృప్తి

డాబాగార్డెన్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎవరి పరిధిలో వారు ఇతరులకు సహాయం చేసి ఆత్మసంతృప్తి పొందవచ్చునని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సక్రమమైన మార్గంలో నడవాలన్నారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ అందరూ ప్రేమ, కరుణ, దయతో ముందుకు సాగాలన్నారు. బ్రహ్మకుమారీల ప్రతినిధి బీకే రామేశ్వరి, గంట్ల శ్రీనుబాబు, నాగరాజు పట్నాయక్ పాల్గొన్నారు.

వర్సిటీల అథ్లెటిక్స్ మీట్‌కు ఏయూ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల, మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును మంగళవారం ప్రకటించారు. భువనేశ్వర్ కిట్ యూనివర్సిటీలో జరిగే ఈ టోర్నీ పురుషుల విభాగంలో కోరుకొండ కౌశిక్, శెట్టి లోహిత్, చల్లా సురేష్, మల్లు హరీష్, దూడ బాలు, వి.రమేష్, టి.గోపాలకృష్ణ, అడ్డూరు ఆనంద్, ఎస్.అప్పలరాజు, పంగి పవన్‌కుమార్, పిల్లా కృష్ణప్రసాద్; మహిళల విభాగంలో పైడి వసంత, ఎం.నాగసాయి వర్షిణి, కె.దివ్య దుర్గ, లంక మేరీ గ్రీస్, వారణాసి భార్గవి, సింహాద్రి శ్రావణి, దాసరి స్రవంతి, కె.నాగలక్ష్మి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ జట్టుకు ఎస్.అప్పారావు కోచ్‌గా వ్యవహరిస్తాడు. ఈ సందర్భంగా మంగళవారం జిమ్నాజియం ఇండోర్ హాల్లో జరిగిన కార్యక్రమానికి ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ముఖ్య అతిథిగా హాజరై అథ్లెట్లను అభినందించారు. పతకాలు సాధించి ఏయూ ఖ్యాతిని పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం సంచాలకులు, ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ పాల్గొన్నారు.



పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

జోనల్ కమిషనర్ ఆదేశం

అల్లిపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దృష్టి సారించాలని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు ఆదేశించారు. వార్డుల్లో చెత్తసేకరణ, రోడ్లపై చెత్త కుప్పలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో మంగళవారం గ్రేటర్ 32, 33 వార్డుల్లోని వివేకానంద కాలనీ, కుమ్మరవీధి, బంగారమ్మమెట్ట, అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్, నేరెళ్లకోనేరు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. ప్రతి ఇంటి నుంచి వాహనాల ద్వారా చెత్త సేకరించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించేలా వ్యాపారులకు అవగాహన కల్పించాలని జడ్సీ మల్లయ్యానాయుడు సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శివప్రసాద్, కాశీరావు, పారిశుధ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి కాసుల వర్షం

మార్గశిర మాసోత్సవాల్లో భక్తుల రద్దీ ▸ చివరి గురువారం దర్శనానికి విస్తృత ఏర్పాట్లు

జగదాంబ కూడలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి మూలవిరాట్ దర్శనం మహద్భాగ్యంగా భక్తులు భావిస్తున్నారు. దర్శించుకున్న తరువాత ఎవరికి తోచిన రీతిలో వారు హుండీల్లో కానుకలు సమర్పించుకుంటూ అమ్మవారిపై భక్తిని చాటుకుంటున్నారు. టిక్కెట్ దర్శనాల రుసుము భారంగా మారినా, అమ్మవారి హుండీ ద్వారా కానుకలు సమర్పించడంలో భక్తులు ఏమాత్రం తగ్గడం లేదు. హుండీలో కానుకల లెక్కింపుతో ఈ విషయం వెలుగుచూసింది, మార్గశిర మాసోత్సవాల్లో మునుపటికి భిన్నంగా హుండీ ఆదాయం పెరిగి రికార్డు సృష్టించింది. 40 రోజుల్లోనే 78.79 లక్షల ఆదాయం రావడం అధికారులను ఆశ్చర్యపరిచింది. మూడో గురువారం తుఫాన్ కారణంగా ఆదాయానికి గండి పడిందని ఆలయ అధికారుల అభిప్రాయం. ఆ తర్వాత రెండు రోజులు కూడా వర్షం కురవడంతో రాబడికి అడ్డంకిగా మారింది వాతావరణ అనుకూలత ఉంటే రూ. కోటి ఆదాయం సమకూరేదని అధికారుల అంచనా. హుండీల్లో తక్కువ సమయంలో రికార్డు స్థాయి ఆదాయం రావడంతో ఈవో కె.శోభారాణి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా కనకమహాలక్ష్మి అనుగ్రహమని, దర్శనాల్లో సంతృప్తి చెంది భక్తులు మనఃపూర్వకంగా సమర్పించిన కానుకలుగా ఆమె భావిస్తున్నారు. మూడో గురువారం కోల్పోయిన ఆదాయాన్ని చివరిదైన నాలుగో గురువారం రాబట్టుకోవాలన్న ఆలోచనలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు వారాల్లో ఎదురైన అనుభవాలను సమీక్షించుకుని భక్తులు సంతృప్తికరంగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. టిక్కెట్ దర్శనాలు, ప్రసాదాలు, దర్శనాల రుసుముల ద్వారా మరింత ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు.



కనకమహాలక్ష్మి మూలవిరాట్‌ను దర్శించుకుంటున్న భక్తులు

కొనసాగుతున్న రద్దీ

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. వాతావరణం అనుకూలంగా లేకున్నా నగరం సహా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. శీఘ్ర దర్శనాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవడంతో భక్తులు సంతోషంతో వెనుదిరిగారు. ఉచిత ప్రసాద వితరణకు భక్తుల నుంచి విశేష స్పందన కనిపించింది. భద్రత విధుల్లో పాల్గొంటున్న పోలీసులకు ప్రత్యేక భోజన సదుపాయం కల్పించడంతో వారు ఊరట చెందుతున్నారు.

విద్యుత్ కార్మికులకు సంఘీభావం



విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వద్ద సిటు నిరసన

జగదాంబ కూడలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చండీగఢ్ విద్యుత్ కార్మికుల ఆందోళనకు సీఐటీయూ (సిటు) సంఘీభావం తెలిపింది. మంగళవారం విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ చండీగఢ్ రాష్ట్రం విద్యుత్ పంపిణీ సంస్థను ప్రైవేట్‌పరం చేసేందుకు ఉపక్రమించిందన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి వ్యతిరేకంగా చండీగఢ్ ప్రభుత్వంపై విద్యుత్ కార్మికులు ఆందోళనలు చేపడుతున్నారన్నారు. వీరికి సంఘీభావంగా నిరసనకు దిగామన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలతో విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతోందని, దీన్ని సిటు ఖండిస్తుందన్నారు. నిరసన కార్యక్రమంలో సిటు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

భోజ ప్రబంధం కావ్యావిష్కరణ



పౌర గ్రంథాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రసన్న భారతి సాహిత్యసభ డాక్టర్ డి.వి. సూర్యారావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముందుగా ప్రసన్న భారతి పత్రిక స్థాపకులు కొడేహుడి సుబ్బారావు సాహిత్య సేవను వివరించారు. కార్యదర్శి సర్వేశ్వర ప్రసాద్ నివేదికలో పత్రిక నిర్వహణలోని సాధక బాధకాలను పేర్కొన్నారు. కొండేపూడితో తన పరిచయాన్ని ఆత్మీయ అతిథి రామవరపు శరత్ బాబు వివరించారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ప్రసంగిస్తూ పత్రిక ఇంకా అదనపు శీర్షికలతో జనాకర్షకంగా తీర్చిదిద్దవలసిన అవసరాన్ని చెబుతూ పలు సూచనలు చేశారు. ప్రముఖ పద్య కవి బులుసు వెంకటేశ్వర్లు సాహిత్య పత్రిక విశిష్టతను వివరించారు. అనంతరం రచయిత మంగు శివరామ ప్రసాద్ రచించిన భోజ ప్రబంధం కావ్యాన్ని శరత్ బాబు ఆవిష్కరించి సమీక్షించారు. ప్రసన్న భారతి శతక సాహిత్య పురస్కారాన్ని బండికాడ అంజయ్య గౌడ్‌కి ప్రదానం చేసి సత్కరించారు. విద్యార్థులకు నిర్వహించిన పద్య పఠనం, వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మళ్లీ విధుల్లోకి తీసుకోరూ!

సీతంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తొలగించిన తమను విధుల్లోకి తీసుకునేలా చొరవ చూపాలని కోరుతూ హెల్త్ అసిస్టెంట్లు సీతంపేట రాజేంద్ర నగర్‌లోని గృహంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్లు సాయికిరణ్, మల్లేశ్వరరావు, కృష్ణమోహన్, నాగరాజు, లంక శ్రీను, వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్

గాంధీ సెంటర్‌ను సందర్శించిన టిబెటన్లు

సీతమ్మధార, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి కోరుతూ మోటర్ సైకిల్‌పై ప్రయాణం చేస్తున్న టిబెటన్ యూత్ కాంగ్రెస్‌కు చెందిన సుమారు 15 మంది యువకులు మంగళవారం బుల్లయ్య కళాశాల్లోని గాంధీ సెంటర్‌ను సందర్శించారు. వీరికి గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఉపాధ్యక్షులు నరవ ప్రకాశరావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కెఎస్ఎస్ మూర్తి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ భారతదేశం గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ శాంతి కోసం నిరంతరం కృషి చేస్తోందని, అదే విధంగా దలైలామాతో కలిసి శాంతి కోసం పనిచేస్తూ టిబెట్ ప్రజలపై సానుభూతి చూపుతోందన్నారు. శాంతి, అహింసతో ఏదైనా సాధించవచ్చని హితవు పలికారు. టిబెటన్ యూత్ కాంగ్రెస్ నాయకుడు గోన్‌పో దుండప్ మాట్లాడుతూ టిబెట్ శాంతిని కోరే చిన్న దేశమని, యువతలో ఆత్మ విశ్వాసం, నాయకత్వ లక్షణాలు, విద్యాభివృద్ధికి టిబెటన్ యూత్ కాంగ్రెస్‌గా ఏర్పడి అనేక ఏళ్లుగా పనిచేస్తున్నామన్నారు.

రూ.1.5 కోట్లతో తల్లిపాల నిధికి సన్నాహాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

మహారాణిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొదటిసారిగా విశాఖ కేజీహెచ్‌లో తల్లిపాల నిధి (మదర్స్ మిల్క్ బ్యాంక్) ఏర్పాటు చేయనున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ సీనియర్ ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ కె.సంతోష్‌కుమార్ మంగళవారం కేజీహెచ్‌ను సందర్శించి ఇందుకోసం స్థల పరిశీలన చేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ 'తల్లిపాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు', 'తల్లిపాలు అమృతం.. డబ్బా పాలు నిషేధం' అనే నినాదంతో సుసేనా హెల్త్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో రూ.1.5 కోట్లతో దీన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జనవరిలోన ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. ఈ విషయమై బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ చౌదరి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

పరీక్షలు రాసేవిధంగా చూడనున్నారు. గత ఏడాది వరకూ మధురవాడ విద్యార్థులకు సిటీలో, గాజువాక విద్యార్థులకు పెందుర్తిలో సెంటర్లు కేటాయించేవారు. ఈ ఏడాది అటువంటి సమస్య లేకుండా విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పరీక్షల నిర్వహణకు సన్నాహాలు

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఫర్నిచర్, విద్యుత్, పరిశుభ్రమైన గదులు, మరుగుదొడ్లు వంటి పూర్తిస్థాయి మౌలిక వసతులు కలిగిన జూనియర్ కళాశాలలను గుర్తించారు. 2023-24 ఏడాదిలో 93 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈసారి ఒకటి, రెండు కేంద్రాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో 188 కళాశాలల నుంచి 82,899 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం నుంచి 42,228, ద్వితీయ సంవత్సరం నుంచి 40,671 మంది ఉన్నారు. రవాణా సౌకర్యం లేని గాజువాకలోని విశాఖ డిఫెన్స్ అకాడమీ, మౌలిక వసతులు లేనందున అగనంపూడి, మధురవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను పరీక్షల కేంద్రాల నుంచి తప్పించారు.

పరీక్షా కేంద్రాలకు నో అంటున్న కార్పొరేట్ కళాశాలలు...

జిల్లాలోని కొన్ని కార్పొరేట్ జూనియర్ కళాశాలలు తమ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అంగీకరించడం లేదని తెలిసింది. సాధారణంగా కార్పొరేట్ కళాశాలలు ఇంటర్ విద్యతో పాటు, ఎంసెట్, ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటాయి. మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు ఉన్నందున ఆయా రోజుల్లో తమ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం కుదరదనే పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు ససేమిరా అంటున్నట్టు సమాచారం.

జోన్‌ల వారీగా...

ఈ ఏడాది నుంచి జోన్‌ల వారీగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. మౌలిక వసతులు కలిగిన కళాశాలలను ఎంపిక చేసి అన్నీ గదుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

-ఆర్ఐవో మురళీధర్

వైసీపీ నిర్లక్ష్యం.. పేదలకు శాపం

... 5వ పేజీ తరువాయి

3,47,284 మంది దరఖాస్తు చేసుకోగా 2,03,438 మందిని అర్హులుగా గుర్తించారు. అందులో సొంత స్థలాలు కలిగి ఉన్న 8,262 మందికి బీఎల్‌సీ (లబ్ధిదారుడే నిర్మించుకోవడం) కింద పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేయాలని నిర్ణయించారు. స్థలాలు లేని వారికి 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఫ్లాట్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 300 చదరపు అడుగులు కోసం రూ.25 వేలు, 365 చదరపు అడుగుల ఫ్లాట్ కోసం రూ.50 వేలు, 430 చదరపు అడుగుల ఫ్లాట్‌కు రూ.లక్ష డీడీలు తీయాలని ప్రభుత్వం సూచించింది. అర్హులుగా తేలిన వారిలో 43,844 మంది డీడీలు తీసి జీవీఎంసీ యూసీడీ అధికారులకు అందజేశారు. జీవీఎంసీ పరిధిలో 55 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంగివలస, బక్కన్నపాలెం, కొమ్మాది, దబ్బంద, అచ్చింనాయుడులోవ, ములగాడ, ట్రైజంక్షన్, దువ్వాడ, భానోజీతోట, అగనంపూడి, బర్మా కాలనీ, తలారివానిపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి, కొండకొప్పాక, సిరసపురం, సత్యనారాయణపురం, రాతిచెరువు, చినముషిడివాడ, చీమలాపల్లి, పరవాడ, అప్పికొండ, నడుపూరు, లంకెలపాలెం వంటి ప్రాంతాల్లో భూసేకరణ చేశారు. వీటితోపాటు సుద్దగెడ్డ, ఆదర్శనగర్, చిలకపేట, సీహార్స్ జంక్షన్, రాజీవ్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ముత్యాలమ్మకాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, గౌరీనగర్, ఏఎస్ఆర్ నగర్‌లలో మురికివాడలను తొలగించి అదే స్థలంలో 1,256 ఫ్లాట్లు చొప్పున నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. మొత్తం 31 లేఅవుట్లలో 24,192 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. 2019 మార్చి నాటికి నాలుగు వేల ఇళ్ల నిర్మాణం పూర్తికావడంతో లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ...గతంలో జరిపిన కేటాయింపులను రద్దు చేసింది. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయంటూ మళ్లీ దరఖాస్తులు ఆహ్వానించింది. సర్వే పేరుతో వడపోసి గత ప్రభుత్వ హయాంలో అర్హులుగా గుర్తించిన వారిలో 13,761 మందిని అనర్హులుగా తేల్చి, 30,083 మందిని మాత్రమే అర్హులుగా నిర్ధారించింది. జీవీఎంసీ పరిధిలో 24,192 ఇళ్ల నిర్మాణం మాత్రమే జరుగుతుండడంతో వాటికి మాత్రమే లబ్ధిదారులను లాటరీ ద్వారా 2020లో ఎంపిక చేసింది. మిగిలిన వారికి జగనన్న లేఅవుట్లలో సెంటు చొప్పున స్థలాన్ని కేటాయిస్తామని చెప్పింది. 300 చదరపు అడుగుల ఫ్లాట్‌ను లబ్ధిదారులకు ఉచితంగా అందజేస్తామని, 365 చదరపు అడుగుల ఫ్లాట్‌కు రూ.50 వేలు కాకుండా రూ.25 వేలు, 430 చదరపు అడుగుల ఫ్లాట్‌కు రూ.లక్షకు బదులుగా రూ.50 వేలు చెల్లించాలని ప్రకటించింది.

ఐదేళ్లలో అడుగు ముందుకు పడని పనులు

2019లో వైసీపీ అధికారం చేపట్టినప్పుడు ఏడాదిలోగా ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించి లబ్ధిదారులకు అప్పగిస్తామని ప్రకటించింది. కానీ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించింది. టీడీపీ హయాంలో నిర్మాణం పూర్తయిన సముదాయాలకు ఉన్న రంగులను మార్చి వైసీపీ జెండాను పోలిన రంగులను వేయించింది. నిర్మాణం చివరి దశలో ఉన్న వాటిని పూర్తిచేయడానికే పరిమితమైంది. ఐదేళ్లలో కేవలం 7,456 మంది లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లను అప్పగించింది. వీటిలో చాలాచోట్ల కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఆయా ఇళ్లలో దిగడానికి ఆసక్తి చూపలేదు. కేవలం నాలుగు వేలలోపు ఇళ్లలో మాత్రమే నివాసాలు ఉంటున్నారు. టిడ్కో ఇళ్ల పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థలకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు పనులను నిలిపివేశారు. దాంతో చాలాచోట్ల టీడీపీ హయాంలో ఎక్కడ వరకూ పనలు జరిగాయో...వైసీపీ అధికారం నుంచి దిగిపోయే సరికి కూడా అదేస్థాయిలో ఉండిపోయాయి. ఐదేళ్లపాటు నిర్మాణపనులు నిలిచిపోవడంతో పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. బక్కన్నపాలెంలోని టిడ్కో సముదాయాలు మందుబాబులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. చీమలాపల్లిలో మొండిగోడలతోనే నిర్మాణాలు నిలిచిపోయాయి. టిడ్కో ఇళ్ల నిర్మాణంపై ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించి తిరిగి పనులు ప్రారంభించాలనే యోచనలో ప్రభుత్వం ఉందని టిడ్కో అధికారులు పేర్కొంటున్నారు.

ఉక్కులో ఫైర్ ప్రైవేటీకరణ

... 5వ పేజీ తరువాయి

హెచ్‌పీసీఎల్, పోర్టు, ఫార్మా సిటీ వంటి పరిశ్రమల్లో భారీ ప్రమాదాలు సంభవించినప్పుడు స్టీల్ ప్లాంటు అగ్నిమాపక శకటాలు వెళ్లి సహాయ సహకారాలు అందిస్తున్నాయి. ప్లాంటుతో పాటు ఉద్యోగులు నివసించే టౌన్‌షిప్, హిల్‌టాప్ గెస్ట్‌హౌస్, ఆస్పత్రి, స్కూళ్లు, పోస్టాఫీసులు, ఇతర భవనాలకు కూడా వీరు రక్షణ కల్పించాల్సి ఉంది. ఈ విభాగంలో పనిచేసే వారు ప్లాంటుకు చెందిన శాశ్వత సిబ్బంది కాబట్టి ఎటువంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురైనా ప్రాణాలకు తెగించి రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఇప్పుడు దీనిని ప్రైవేటీకరణ చేస్తే...కాంట్రాక్టుకు పనిచేసే సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి స్టీల్‌ప్లాంటు ఆస్తులను, మనుషులను కాపాడతారా?...అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇంత పెద్ద కర్మాగారం రక్షణ బాధ్యతలను ప్రైవేటుకు అప్పగించడం సముచితం కాదని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పైగా ఈ ఫైర్ ఫైటింగ్ విభాగంలో ఉన్న వనరులన్నీ ప్రైవేటు ఏజెన్సీకి ఇచ్చి, కేవలం కాంట్రాక్టు సిబ్బందితో నిర్వహించాలని కోరడం ఏ విధంగా ఆమోదయోగ్యం కాదనే వాదన గట్టిగా వినిపిస్తోంది.

ఇది దుర్మార్గం..వెనక్కి తీసుకోవాలి

యాజమాన్యం ప్లాంటుకు అవసరమైన ముడి పదార్థాలు ఎలా తేవాలి?, ఉత్పత్తి ఎలా పెంచాలి?, మార్కెటింగ్ ఏ విధంగా బలోపేతం చేయాలనే అంశాలపై దృష్టి పెట్టకుండా ఉద్యోగుల సంఖ్య తగ్గించడంపైనా, ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటీకరణ చేయడంపైనా కసరత్తు చేస్తోంది. ఇది దుర్మార్గమైన చర్య. దీని కోసం విడుదల చేసిన ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకోవాలి. **-అయోధ్యారామ్, సిటు నాయకులు**

విషాదం

... 5వ పేజీ తరువాయి

బయలుదేరారు. వారి వాహనం ఉదయం తొమ్మిది గంటల సమయంలో కంచిలి మండలం చిన్న కొజ్జిరియా సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొని బోల్తా పడింది. ఘటనా స్థలంలోనే లావణ్య మృతిచెందింది. మిగిలిన క్షతగాత్రులను స్థానికులు 108 వాహనం, ప్రైవేట్ అంబులెన్స్‌లో సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో నేహా గుప్తా, సోమేశ్వరరావు మృతిచెందారు. రాధిక పరిస్థితి విషమంగా ఉండడంలో ఆమెను శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కారు డ్రైవ్ చేస్తున్న రాజేష్ గుప్తాకు, అతని తల్లి సుబ్బలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల మృతదేహాలను చూస్తూ రాజేష్ రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. లావణ్య, నేహా గుప్తా, సోమేశ్వరరావుల మృతదేహాలను సోంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

☛ సంక్షిప్తంగా..

నగర ప్రజలకు ప్రముఖుల క్రిస్మస్ శుభాకాంక్షలు

వెంకోజీపాలెం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పలువురు ప్రముఖులు నగర ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తమ శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే వీఎంఆర్డీఏ పరిధిలోని ప్రజలకు చైర్మన్ ప్రణవ్ గోపాల్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగం, ప్రేమ, కరుణకు చిహ్నం క్రిస్మస్ పండుగ అన్నారు. మానవాళి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు యేసుక్రీస్తు అన్నారు. శాంతి, కరుణ, సహనం, ప్రేమతో జీవించిన క్రీస్తు జీవనం నేటికీ అందరికీ ఆచరణీయమన్నారు.

సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



దుకాణదారుల వద్ద కవర్లను తీసుకుంటున్న శానిటరీ అధికారులు

వెంకోజీపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్డ్ కవర్ల వినియోగం వద్దని జీవీఎంసీ అధికారులు పదేపదే చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదంటూ మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి శానిటరీ అధికారులు స్పందించారు. దుకాణదారుల వద్ద సింగిల్ యూజ్డ్ కవర్లను సేకరించి, వారికి హెచ్చరించారు. మరోసారి సింగిల్ యూజ్డ్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, భారీ జరిమానా విధిస్తామని చెప్పారు. దీనిలో 16వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శుభ్రం మేస్త్రి నమ్మి చిన్నరాజు, జి.బాబు ఉన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



మెరిట్ సర్టిఫికెట్లతో విద్యార్థులు

వెంకోజీపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోటలోని శ్రీచైతన్య టెక్నో స్కూలులో మంగళవారం గణిత శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.రమణి మాట్లాడుతూ నిత్యజీవితంలో గణితం ప్రాధాన్యం గురించి తెలియజేశారు. అనం తరం విద్యార్థులకు గణిత శాస్త్రంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ పంపిణీ చేశారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
● **విడుదల-2 :** శ్రీకన్య వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **యువి :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
● **ముఫాసా :** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
● **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు)38, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 24, క్యారెట్ 36 దొండకాయలు 44, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది) 56, బరబాటి 42, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 56, కీరదోస 36, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 38, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామ కాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

పార్కా? పశువుల సంతా?

» పట్టించుకోని అధికారులు
» కనీసం నియంత్రణ చర్యలు శూన్యం
» ఆకతాయిల చేష్టలకు గేట్లు లేని పరిస్థితి
» ఉదయం రాగానే అధ్వానంగా ఉంటున్న అబ్దుల్ కలాం ఉద్యానవనం



పార్కులోకి చేరి పడక వేసిన పశువులు



పశువుల పేడ, మూత్రంతో నిండి అధ్వానంగా తయారైన క్రీడా స్థలం

వెంకోజీపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులు, పెద్దలు, వృద్ధులతో కలకలాడాల్సిన పార్కు ఆవుల సంతలా మారింది. శారీరక ఆరోగ్యం, ఉల్లాసం కోసం ఆటగాళ్లు ఆడే స్థలం ఆవుల మూత్ర విసర్జనతో నిండిపోతున్నది. దీనిపై ఎన్నిసార్లు పశుసంవర్ధక అధికారులకు ఫిర్యాదు చేసినా.. కనీసం పట్టించుకోకపోగా, నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని పార్కుకు వచ్చే వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది 16వ వార్డులోని హెచ్‌బీకాలనీ అబ్దుల్ కలాం పార్కు పరిస్థితి.

రోజూ ఉదయానే పార్కుకు వచ్చే వారు వ్యాయామం చేయడం గానీ, ఆటలు ఆడుకోవడం గానీ, కరాటే శిక్షణ పొందడం గానీ చేయాలి. కానీ ఇక్కడకు ముందు వచ్చే వారు ఆవుల పేడలను ఎత్తుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంకా ఎన్నాళ్లు ఈ పరిస్థితి తమకు కొనసాగుతుందోనని పార్కుకు వచ్చే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినపుడు మాత్రం వెటర్నరీ అధికారులు స్పందించి తూతూ మంత్రంగా చర్యలు చేపతారు. అది కూడా ఒకటి, రెండు రోజులకే పరిమితం.

పార్కు దగ్గర ఉన్న చిన్న లేతదూడను మాత్రం తీసుకెళ్లి తమ పని అంత అన్నట్టుగా వ్యవహరిస్తారు. ఇక్కడే పార్కు చుట్టు పక్కలా ఖాళీగా ఉన్న స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ స్థలాల్లో ఆవులను పెంచుతూ, వ్యాపారాన్ని సాగిస్తున్న వారికి ఎలాంటి హెచ్చరికలు జారీ చేయక పోవడంతో మళ్లీ ఈ ఆవుల సంచారం పార్కులో యథేచ్ఛగా సాగుతోందని స్థానికులు వాపోతున్నారు. ఆవులను పెంచే వారు వాటిని తమ పరిధి మేరకు సంరక్షించుకోవాలి.

కానీ వాటిని యథేచ్ఛగా వదిలేస్తుండడంతో పశువులు వచ్చి ఎంచక్కా పార్కులో తిష్ఠ వేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత వెటర్నరీ అధికారులు దీనిపై కఠిన చర్యలు చేపట్టాలని వారు స్థానికులు, పార్కులకు వచ్చేవారు కోరుతున్నారు.

ఆకతాయిల బెడద సైతం..

అంతేకాకుండా.. ఈ పార్కులో ఆకతాయిలు అసాంఘిక కార్యక్రమాలు చేపడుతూ పార్కుకు ఉన్న గేట్లు, గోడను విరగ్గొట్టేస్తున్నారు. దీంతో ఆవులు లోపలకు వచ్చేందుకు ఎలాంటి నియంత్రణ లేకుండా పోతోంది. అధికారులు, పోలీసులు ఈ ఆకతాయిలపై కూడా దృష్టి సారిస్తే కొంత ప్రయోజనం ఉంటుందని పార్కు సందర్శకులు అంటున్నారు.

అలాగే ఈ పార్కులో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని, దీంతో పార్కుకు రావాలంటేనే ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

24 నుంచి అంతర్జాతీయ ఫిలాసఫీ సదస్సు



వీసీ శశిభూషణరావును ఆహ్వానిస్తున్న నిర్వాహక ప్రతినిధులు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు తదితరులు

వెంకోజీపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగరిక సమాజంలో బేదాభిప్రాయాల పరిష్కారానికి తత్త్వశాస్త్రం, యోగా పాత్ర ప్రధానాంశంగా ఏయూలో జనవరి 24 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న 17వ అంతర్జాతీయ సోషల్ ఫిలాసఫీ, 11వ అంతర్జాతీయ యోగా-ఆధ్యాత్మిక శాస్త్రాల సదస్సులకు ఏయూ వీసీ జి.శశిభూషణరావును సదస్సు ప్రారంభకులుగా ఆహ్వానించారు. మంగళవారం వీసీ ఛాంబర్‌లో ఆయనను పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు సాదరంగా ఆహ్వానించారు. వీసీతో పాటు ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ వి.వెంకటరావు, సదస్సు కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ వైవీ సత్యనారాయణలను కూడా ఆహ్వానం పలికారు. అందుకు వీసీ సానుకూలంగా స్పందిస్తూ ఫిలాసఫీర, యోగా అంతర్జాతీయ సంయుక్త సదస్సుకు యూనివర్సిటీ ఆర్థికంగా, హార్థికంగా అన్నీ విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఇదే సదస్సుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ డాక్టర్ వి.రాధాకృష్ణ కృపాసాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారని ఆహ్వాన సంఘం ప్రతినిధులు తెలియజేశారు.

భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ స్థాపించిన ఫిలాసఫీ డిపార్టుమెంట్ అంతర్జాతీయ సదస్సుల నిర్వహణలో ఏయూ ఘనతని ప్రపంచ వ్యాప్తంగా చాటుతున్నదని వీసీ కొనియాడారు. విద్యా, శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఏయూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయపరంపర పతకాన్ని గౌరవంగా, అద్వితీయంగా ఎగురవేయడంలో సదస్సులు ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయని ఆహ్వానితులను ప్రశంసించారు. ఈ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు దేశం నుంచే కాకుండా అనేక ఇతర దేశాల నుంచి కూడా ప్రతినిధులు, ఉపన్యాసకులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

కాపు ప్రీమియం లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలు ప్రారంభం

వెంకోజీపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏయూ మైదానంలో కాపు ప్రీమియం లీగ్ సీజన్-2 పోటీలు అట్టహాసంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్‌ను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. టోర్నమెంట్‌లో కాపు సామాజికవర్గానికి సంబంధించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 12 ఫ్రాంచైజ్ జట్ల తరుపున 180 మందితో ఈ టోర్నమెంట్ జరుగుతుందని తెలిపారు. పూర్వ రంజీ ఆటగాడు గందం ప్రసాద్‌రావు పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీలు ఐదు రోజుల పాటు కొనసాగుతాయని నిర్వహకులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

ఎండాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఫిట్స్ వ్యాధికి గురవడంత మెట్లపై నుంచి జారి తీవ్ర గాయాల పాలైన బాలుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పీఎం పాలెం పోలీసులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పీఎంపాలెం సాయిప్రియా గార్డెన్స్‌లో మందపాటి సుబ్బరాజు కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నారు.. ఈ నెల 4న సుబ్బరాజు కుమారుడు బాలాజీ రాజు (10) ఫిట్స్ వచ్చి మెట్లపై పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బాలాజీ రాజు మంగళవారం మృతి చెందాడు.మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎంపాలెం స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలిండియా వర్సిటీల అథ్లెటిక్స్ మీట్‌కు ఏయూ జట్టు



ఆలిండియా ఇంటర్ వర్సిటీ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికైన పురుషులు, మహిళా జట్లు

విశాఖపట్నం స్పోర్ట్సు డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల, మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును మంగళవారం ప్రకటించారు. భువనేశ్వర్ కిట్ యూనివర్సిటీలో జరిగే ఈ టోర్నీ పురుషుల విభాగంలో కోరుకొండ కౌశిక్, శెట్టి లోహిత్, చల్లా సురేష్, మల్లు హరీష్, దూడ బాలు, వి.రమేష్, టి.గోపాలకృష్ణ, అడ్డూరు ఆనంద్, ఎస్.అప్పలరాజు, పంగి పవన్‌కుమార్, పిల్లా కృష్ణప్రసాద్; మహిళల విభాగంలో పైడి వసంత, ఎం.నాగసాయి వర్షిణి, కె.దివ్య దుర్గ, లంక మేరీ గ్రీస్, వారణాసి భార్గవి, సింహాద్రి శ్రావణి, దాసరి స్రవంతి, కె.నాగలక్ష్మి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ జట్టుకు ఎస్.అప్పారావు కోచ్‌గా వ్యవహరిస్తాడు. ఈ సందర్భంగా మంగళవారం జిమ్నాజియం ఇండోర్ హాల్లో జరిగిన కార్యక్రమానికి ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ముఖ్య అతిథిగా హాజరై అథ్లెట్లను అభినందించారు. పతకాలు సాధించి ఏయూ ఖ్యాతిని పెంచాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు, ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ పాల్గొన్నారు.

జూ క్యూరేటర్‌గా మంగమ్మకు పూర్తి స్థాయి బాధ్యతలు



ఆరిలోవ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలకు ఇన్నాళ్లూ ఫుల్ అడిషనల్ చార్జ్ క్యూరేటర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన జి.మంగమ్మకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ పని చేసిన డాక్టర్ నందనీ సలారియాను బదిలీ కావడంతో ఇక్కడకు మంగమ్మను అడిషనల్ చార్జ్ క్యూరేటర్‌గా అక్టోబర్ 8న నియమించారు. ప్రస్తుతం ఆమెకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈమె గతంలో ఈ జంతు ప్రదర్శనశాలలోనే డెప్యూటి కన్సర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం క్యూరేటర్‌గా పూర్తి స్థాయి బాధ్యతలు నిర్వహించనున్నారు.

సంపత్ వినాయగర్ దేవాలయ హుండీ లెక్కింపు

» 38 రోజులకు రూ.23,76,071 ఆదాయం



హుండీ లెక్కింపు పరిశీలిస్తున్న ఈవో శిరీష, ఫౌండర్ ప్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్

సిరిపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శ్రీసంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపును మంగళవారం ఆలయ కార్యాలయ ఆవరణలో నిర్వహించనట్టు ఆలయ ఈవో కె.శిరీష, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలియజేశారు. గడిచిన 38 రోజులకు రూ.23,76,071 నగదు వచ్చినట్టు తెలిపారు. బంగారం 21-400 మిల్లీ గ్రాములు, సిల్వర్ 0-107-000 మిల్లీ గ్రాములు, యూఎస్‌ఏ 96, సింగపూర్ 10, యుఏఈ డెర్హామ్స్ 200, థాయ్ భట్ 20 కరెన్సీ, చెక్కు ద్వారా రూ.111 లభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ హుండీల సూపర్‌వైజర్స్ కె.శ్రీనివాసరావు, శ్రీవెంకటేశ్వరసేవా సంఘం, ఆలయ సిబ్బంది, ఇండియా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

రూ.1.5 కోట్లతో తల్లిపాల నిధి ఏర్పాటు



తల్లిపాల నిధి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

మహారాణిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొదటిసారిగా విశాఖ కేజీహెచ్‌లో తల్లిపాల నిధి (మదర్స్ మిల్క్ బ్యాంక్) ఏర్పాటు చేయనున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ సీనియర్ ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ కె.సంతోష్‌కుమార్ మంగళవారం కేజీహెచ్‌ను సందర్శించి ఇందుకోసం స్థల పరిశీలన చేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ 'తల్లిపాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు', 'తల్లిపాలు అమృతం.. డబ్బా పాలు నిషేధం' అనే నినాదంతో సుసేనా హెల్త్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో రూ.1.5 కోట్లతో దీన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జనవరిలోన ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. ఈ విషయమై బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ చౌదరి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధిక పింఛన్ అందేలా చూడండి : స్టీల్‌ప్లాంట్ పెన్షనర్ల సంఘం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అధిక పింఛన్ల మంజురులో పీఎఫ్ ఆర్గనైజేషన్ చేస్తున్న అనవసర జాప్యంపై జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరుతూ ఎంపీ శ్రీభరత్‌కు స్టీల్‌ప్లాంట్ పెన్షనర్ల సంఘం సభ్యులు మంగళవారం ఎంపీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా 2022 నవంబరులో సుమారు రెండువేల మంది సభ్యులు పీఎఫ్ కార్యాలయానికి సుమారు రూ.400 కోట్లు చెల్లించినా అధిక పింఛను మంజురు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని వివరించారు.

తీరంలో సినీమానందం



తీరం వెలిచిన ఆకులు లేని చెట్టు, చెక్కతో రూపొందించిన చెక్క బాట

విశాలాక్షినగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో సినిమా షూటింగ్ కోసం సెట్‌లో భాగంగా వేసిన ఆకులు లేని చెట్టు, అలానే బాటసారులు నడవడానికి వేసిన చెక్కతో రూపొందించిన బాట ఆకర్షణగా నిలిచాయి. సీతకొండ మలుపు, గుడ్లవాని పాలెం ముగ్గురు అమ్మవార్ల ఆలయం ప్రాంతంలోని తీర ప్రాంతానికి వచ్చే సందర్శకులు వీడియోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఆనందం పొందుతారు. ఆకర్షించే లైట్లతో చెక్క బాటపై నడుస్తూ వీడియోలు తీసుకుంటూ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సినిమా వారు వేసిన సెట్ సందర్శకులకు సంతోషాన్నిస్తున్నాయి.

వాజపేయి శత జయంతిని ఘనంగా నిర్వహించాలి

» బీజేపీ రాష్ట్ర సంఘటన్ మంత్రి మధుకర్



సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్, పక్కన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కోశాధికారి నాగేంద్ర, అధికార ప్రతినిధి తిరుపతిరావు

పెదవాల్తేరు డిసెంబరు 24 : భారత మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజపేయి 100వ జయంతిని పురస్కరించుకుని సుపరిపాలన దినోత్సవం సందర్భంగా బూత్ స్థాయిలలో కూడా వాజపేయి జయంతి వేడుకలు జరుపుకోవాలని బీజేపీ రాష్ట్ర సంఘటన్ మంత్రి ఎస్.మధుకర్ అన్నారు. బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పదాధికారుల సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఇటీవల క్రియాశీల సభ్యత్వ కార్యక్రమం ముగిసిందన్నారు. అలాగే బూత్ కమిటీల నిర్మాణం జరుగుతుందని, రాబోయే రెండు రోజులలో మండల అధ్యక్షుల నియామకం చేపట్టనున్నట్టు చెప్పారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ మోదీ పరిపాలనకు ఆకర్షితులై ఎంతో మంది బీజేపీలో చేరుతున్నారన్నారు. అలాగే వైసీపీకి చెందిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో పార్టీలో చేరనున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, బీజేపీ విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య, జిల్లా పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి విగ్రహావిష్కరణ రేపు



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఉత్తరాంధ్ర కాపు సేవా సంఘం ప్రతినిధులు

ఆరిలోవ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాపు నేత వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 26న ఆరిలోవ ఆఖరి బస్టాప్ సమీపంలో విగ్రహావిష్కరణ చేయనున్నట్టు ఉత్తరాంధ్ర వంగవీటి కాపు సేవా సంఘం నేతలు తెలిపారు. మంగళవారం టీడీపీ 13వ వార్డు తెలుగు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీను, మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టితో పాటు అనేక మంది కాపు సామాజికవర్గ నేతలు పాల్గొననున్నట్టు చెప్పారు. మోహనరంగా బడుగు, బలహీన వర్గాల నాయకుడి అని పేర్కొన్నారు. ఇన్నాళ్లూ రంగా వర్ధంతికి ఆయన ఫోటో పెట్టి కార్యక్రమాలు నిర్వహించామని, ఇప్పుడు ఆయన విగ్రహం కార్యక్రమాలు నిర్వహించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలోని 9 నుంచి 13 వార్డుల నేతలు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పి.ధర్మారావు, ఏడువాక సన్యాసిరావు, పేపరునాయుడు, మోది అప్పారావు, మీసాల మురళీమోహన్, బీజేపీ నాయకుడు ఎం.సన్యాసిరావు, జనసేన నాయకులు రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు గౌరీనాయుడు



పెదవాల్తేరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించబోయే ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో పాల్గొనవలసిందిగా చినవాల్తేరులోని విద్యానగర్ కాలనీకి చెందిన రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కిలారి గౌరీనాయుడుకు ఆహ్వానం అందిందన్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్, అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బరావు ఈ మేరు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా 'యువగళం' శీర్షికతో అద్దేపల్లి రామోహన్ రావు సభా వేదికపై నిర్వహిస్తున్న కవి సమ్మేళనంలో పాల్గొని 'పర్యావరణాన్ని కాపాడుకుందాం' అంశంపై గౌరినాయుడు కవిత గానం చేయనున్నారు. ప్రవాస సాహిత్యం, సాహితీ సంస్థల కృషి అనే అంశంపై ప్రత్యేక ప్రసంగం చేస్తారు. సాహిత్య, సంగీత, సాంస్కృతిక, పరిశోధన, కళా రంగాల్లో చేస్తున్న కృషికి గుర్తింపుగా అరుదైన గౌరవం లభించిందని గౌరీనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సాహితీ మిత్రులు, కళాకారులు గౌరీ నాయుడును అభినందించారు.

ఆటోడ్రైవర్ నిర్లక్ష్యంతో ఒకరికి గాయాలు

ఎండాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యక్తి గాయపడ్డాడు. పీఎం పాలెం పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

పీఎంపాలెం మిథిలాపురి వుడా కాలనీలో బొమ్మాళీ కన్నబాబు (29) నివాసం ఉంటున్నాడు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతడు మ్యాగీ పాయింట్ జంక్షన్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. ఆటో డ్రైవర్ అతివేగంగా నడపడంతో వాహనం బోల్తా పడింది. దీంతో కన్నబాబు గాయాలకు గురయ్యాడు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఆటోడ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్లే గాయాల పాలయ్యానని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

» ఐలా 20వ సర్వసభ్య సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న ఐలా చైర్మన్ రఘు, పాల్గొన్న ప్రతినిధులు

ఆటోనగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సభ్యులు తీర్మానించారు. ఐలా 20వ వార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం రాత్రి ఐలా కార్యాలయంలో జరిగింది. చైర్మన్ రఘు (సత్యనారాయణ రెడ్డి) వార్షిక బడ్జెట్‌ను చదివి వినిపించారు. ఆటోనగర్ రైల్వే వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నాయని పదినెలల్లో అందుబాటులోనికి వస్తుందన్నారు. పరిశ్రమలకు నాణ్యమైన భూగర్భ ఎలక్ట్రికల్ కేబుల్ నెట్‌వర్కు పనులు ప్రారంభించామన్నారు. 113 కేవీ భూగర్భ సబ్‌స్టేషన్ కోసం 3.38 ఎకరాలను అపెరెల్ పార్కులో కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. అభివృద్ధి పనులకు రూ.814.00 లక్షలు కేటాయించారని, టెండరింగ్ దశలో ఉన్నాయన్నారు. ఏపీఐఐసీ ఇన్‌చార్జి జెడ్‌ఎం బి.హరిథరరావు మాట్లాడుతూ ఐలా అభివృద్ధికి ఏపీఐఐసీ సహకరిస్తోందన్నారు. ఐలా కమిషనర్ ఎ.కిశోర్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నూతన రహదారుల నిర్మాణం, కాలువలు, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరిశ్రమలకు నీటి సరఫరా, డ్రైన్లు, విద్యుద్దీపాలపై చర్చించారు. ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలు తమ బ్లాకులలో తెలిపిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, కోశాధికారి పి.పద్మావతి మాట్లాడుతూ ప్రాపర్టీ ట్యాక్స్, బిల్డింగ్ ప్లాను, మెయింటెనెన్స్ నిర్వహణపై ఆదాయ, వ్యయాలను వివరించారు. సమావేశంలో ఐలా మాజీ చైర్మన్లు యార్లగడ్డ సాంబశివరావు, శేషగిరిరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రామకృష్ణంరాజు, వేములపల్లి కిశోర్, వాసివా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, పారిశ్రామికవేత్తలు ఏకె బాలాజీ పాల్గొన్నారు.



పోర్టు ఆస్పత్రి సమీపంలోని లూర్దుమాత చర్చికి విద్యుత్ దీపాలతో అలంకరణ

చర్చిలకు క్రిస్మస్ శోభ

క్రిస్మస్ సందర్భంగా నగరంలోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వన్‌టౌన్‌లోని సెయింట్ జాన్స్, సర్క్యూట్ హౌస్ వద్ద సెయింట్ పాల్స్, జిల్లా కోర్టు సమీపంలోని పునీత అంతోని, జగదాంబ జంక్షన్ ట్రినిటీ లూథరన్, పోర్టు హాస్పిటల్ వద్ద లూర్దుమాత చర్చిలు కొత్త కళ సంతరించుకున్నాయి. మంగళవారం రాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



గవర్నర్ బంగ్లా సమీపంలోని పాల్స్ చర్చిలో బాల ఏసు జననం సెట్

భలే... భలే... కేకులు!

నగరంలో క్రిస్మస్ సందడి

న్యూ థీమ్స్‌తో వెరైటీ కేకులను సిద్ధం చేసిన బేకరీలు

- ఫొటో, ఫౌంటెన్, శాంతాక్లాజ్ రూపాల్లో ప్రత్యేక ఆకర్షణ
- ప్లమ్, చాక్లెట్, ఆల్మండ్, చెర్రీస్‌తో అదుర్స్ అనిపించేలా
- చిన్నారులను విపరీతంగా ఆకట్టుకుంటున్న కార్టూన్ కేక్స్

సిరిపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):

క్రిస్మస్ అంటే బంధువులంతా కలుసుకోవడం, మిత్రులను పలకరించడం, క్రిస్మస్ చెట్ల అలంకరణ, పాటలు, ఆటలు, వేడుకలు.. కానుకల పంపిణీ ఓహ్ భలే సందడిగా జరుపుకునే పండుగ. ఏడాది చివరిలో వచ్చే పండుగను 365 రోజులు గుర్తుంచుకునేలా ఘనంగా జరుపుకోవాలని క్రైస్తవులంతా భావిస్తారు. ఇందులో ప్రధాన భూమిక పోషించేది కేకులే. అందునా అవి మరింత వెరైటీగా రూపొందితే పండగ సంబరమే..





నగరంలో క్రిస్మస్‌కు రకరకాల వెరైటీ కేకులు లభ్యమవుతున్నాయి. నోరూరించే రకరకాల కమ్మని కేకులు సిద్ధమైపోయాయి. కళాత్మక రీతిలో వీటిని సిద్ధం చేయడంతో కొనుగోలుదారులు ఎగబడుతున్నారు. ఈ ఏడాది చిన్నారులు, యువత, పెద్దలను సైతం ఆకట్టుకునేందుకు న్యూ థీమ్స్‌తో నగరంలోని వివిధ బేకరీలు కేకులను తయారుచేశాయి. ఇవి విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు విపరీతంగా అమ్ముడుపోతున్నాయి.

న్యూ థీమ్స్‌తో తయారీ..

వివిధ రకాల న్యూ థీమ్స్‌తో కేక్‌లు తయారయ్యాయి. గతంలో కేక్ అంటే...రౌండ్‌గా...లేదా స్క్వేర్ మోడల్స్‌లో ఉండేవి. కానీ ఇప్పుడు అలా కాదు.. చిన్నారుల నుంచి అన్ని వయసుల వారినీ ఆకట్టుకునే రీతిలో వాటిని తయారుచేశారు. దీంతో మంచి డిమాండ్ లభిస్తోంది.



కేక్‌లు.. వివిధ రకాలు

ప్లమ్, చాక్లెట్, ఆల్మండ్, రిచ్ ప్లమ్స్, చెర్రీస్, జింజర్, ఫన్నీ క్రిస్మస్, మోడ్రన్ కేక్ ఇలా... ఒకటేమిటి ఎన్నెన్నో వెరైటీలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కేక్‌ది ఒక ప్రత్యేకత. వివిధ రకాల రుచితో సిద్ధమవుతున్నాయి. దీంతో పాటు వాటిని తయారుచేసే క్రమంలో అందమైన రీతిలో తీర్చిదిద్దడంతో మరింత కళ సంతరించుకుంది. క్రిస్మస్ పండుగను ప్రత్యేకంగా జరుపుకునేందుకు వీలుగా శాంతాక్లాజ్, ఫొటోథీమ్స్, చర్చి నమూనా తదితర మోడల్స్ అదుర్స్ అనిపిస్తున్నాయి. దీంతో పాటు పిల్లలను ఆకట్టుకునేలా..కార్టూన్ కేకులు సైతం హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి.





వివిధ కేకులు తయారుచేస్తున్న నిర్వాహకులు

టేస్టీ కేకులున్నాయ్



ఆస్ట్రేలియాలో వివిధ రకాల డిజైన్స్‌తో టేస్టీగా కేకులు తయారుచేస్తారు. క్రిస్మస్‌కు జరుపుకునేందుకు విశాఖ వచ్చాం. ఇక్కడ మంచి టేస్టీ... వెరైటీ కేక్‌లు లభ్యం కావడం ఆనందంగా ఉంది. శాంతాక్లాజ్, క్రిస్మస్ ట్రీ ఎంత ముఖ్యమో... కేకు కూడా అంతే ముఖ్యం.

- వర్మ, ఎలిజిబిత్, ఆస్ట్రేలియా

వెరైటీ డిజైన్స్‌తో...



ప్రస్తుతం రూ.350 నుంచి వివిధ ధరల్లో కేకులు లభిస్తున్నాయి. కిలో, అరకిలో, మినీ, మీడియం రేంజ్‌ల్లో విక్రయిస్తున్నాం. క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేకమైన డిజైన్స్‌తో రూపొందించాం. ఆదరణ లభిస్తోంది.

- జీవై నాయుడు, ఫ్రెష్ ఛాయిస్ ఏరియా మేనేజర్

27న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 27న జరుగుతుందని కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి 43 అంశాలతో ఎజెండా సిద్ధం చేశారు. వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు, నీటి సరఫరా, ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించిన పనులకు సంబంధించిన అంశాను ఎజెండాలో చేర్చారు.

ఐఐఎంకు జాతీయస్థాయి అవార్డులు



ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న సుబ్రహ్మణ్యం

విశాఖపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) నాలుగు కేటగిరీల్లో జాతీయ స్థాయి అవార్డులను దక్కించుకుంది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్‌ఐ) సంస్థ వివిధ కేటగిరీల్లో అవార్డులకు దరఖాస్తులను స్వీకరించగా, అత్యుత్తమంగా నిలిచిన ఐఐఎంవీ నాలుగు కేటగిరీల్లో నూ అవార్డులను సాధించింది. రాయ్‌పూర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఐఎంవీ జూనియర్ సూపరింటెండెంట్ (అడ్మిన్ అండ్ స్టోర్స్) ఎంఎస్ సుబ్రహ్మణ్యం ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం అరుణ్‌షో చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఐదు కేటగిరీల్లో ఐఐఎం దరఖాస్తు చేయగా, నాలుగింటిలో అవార్డులను దక్కించుకుంది. కాఫీ టేబుల్ బుక్ కేటగిరీలో ఐఐఎంవీ ఫీల్డ్, సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఆర్‌అండ్‌డీలో ప్రథమస్థానం, నారీమణి ప్రోగ్రామ్, నైపుణ్య శిక్షణలో ద్వితీయ స్థానం దక్కించుకుంది.

నగరానికి పీఆర్‌ఎస్‌ఐ అవార్డులు ముదావహం

» మేయర్ హరివెంకట కుమారి



విశాఖ చాప్టర్ సభ్యులతో మేయర్ హరికుమారి

డాబాగార్డెన్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా నేషనల్ అవార్డ్స్ జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీలలో జీవీఎంసీతో కలిపి నగరంలోని పలు సంస్థలకు జాతీయ అవార్డులను దక్కించుకోవడం అభినందనీయమని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో విశాఖపట్నం పీఆర్‌ఎస్‌ఐ సభ్యులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నగరాభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేట్, స్వచ్ఛంద, ఎన్జీఓ సంస్థలు ప్రజలను చైతన్య పరిచేలా చేపట్టిన కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా 2024 జాతీయస్థాయిలో రాయపూర్‌లో జరిగిన కాన్ఫరెన్స్‌లో వివిధ కేటగిరీలలో 11 అవార్డులు విశాఖ నగరానికి రావడం సంతోషంగా ఉందన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, పీఆర్‌ఎస్‌ఐ సెక్రటరీ, స్వచ్ఛ విశాఖ రాయబారి (అంబాసిడర్) పీఎల్‌కే మూర్తి, పీఆర్‌ఎస్‌ఐ విశాఖపట్నం చాప్టర్ ఛైర్మన్ కాళీ పాల్గొన్నారు.

అదానీ గంగవరం పోర్టులో రైల్వే క్రూ లాబీ ప్రారంభం



రైల్వే క్రూ లాబీని ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం

గాజువాక, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టులోని ఆర్ అండ్‌డీ యార్డ్‌లో ఆధునిక క్రూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎంఎస్) సదుపాయాలతో కూడిన క్రూ లాబీని మంగళవారం రైల్వే డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే ఉద్యోగుల కోసం అన్ని వసతులతో కూడిన లాబీని ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కార్గో హ్యాండ్లింగ్ కార్యకలాపాల మెరుగుకు పోర్టు యాజమాన్యం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. పోర్టు యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో రూ. 2 కోట్ల మోసం

తగరపువలస, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో రూ.2 కోట్లను కొల్లగొట్టేసిన వైనం బయటపడింది. జీవీఎంసీ రెండో వార్డు వలందపేటలో ఇద్దరు వ్యక్తులు గ్రామస్థుల నుంచి డబ్బు వసూలు చేసి మోసగించినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన సరగడ ఉమ, షేక్ షమీర్ 2022లో చీటీల పేరుతో సుమారు రూ.రెండు కోట్లు వసూలు చేశారు. ఎవరికీ చెల్లించలేదు. ఎప్పుడు అడిగినా ఇదిగో.. అదిగో అంటూ వాయిదా వేస్తున్నారు. దీంతో బాధితుడు కొల్లి హరినాథరెడ్డి మంగళవారం రాత్రి ఫిర్యాదు చేసినట్టు సీఐ బి.సుధాకర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు. కాగా రెండు రోజుల కిందట సరగడ పార్వతీలక్ష్మణరావు దంపతులు కూడా రూ.45 లక్షల వరకూ వసూలు చేసి మోసానికి పాల్పడ్డారని కేసు నమోదైంది.

రాజమండ్రిలో పోలీసులకు చిక్కిన మోసగాడు

సీతంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని సీఎస్‌బీ బ్యాంక్‌లో బంగారు వస్తువులు తాకట్టు పెడతానని నమ్మించి తన బ్యాంక్ ఖాతాకు డబ్బులు బదిలీ చేయించుకుని, ఆ సొమ్ముతో ఉడాయించిన ఘరానా మోసగాడు తమరాన చిరంజీవిని రాజమండ్రిలో ద్వారకా పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అల్లిపురానికి చెందిన అతడిని నగరానికి తీసుకొస్తున్నట్టు తెలిసింది. తప్పుడు రశీదులతో చిరంజీవి తన ఖాతాకు రూ.14.69 లక్షలు ఆన్‌లైన్‌లో బదిలీ చేయించుకున్నాడు. సీఐ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ధర్మేంద్ర ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేము ఎవరి పక్షం కాదు...తటస్థం

» వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి. చిత్రంలో మాజీ మంత్రులు అమర్‌నాథ్, ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే కల్యాణి, మేయర్ హరివెంకటకుమారి, జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర ఉన్నారు

విశాఖపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాము ఎన్‌డీఏ లేదా ఇండియా పక్షం కాదని, తటస్థంగా ఉన్నామని వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 27న ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద చేపట్టనున్న నిరసన పోస్టర్‌ను మంగళవారం ఆయన నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమది ప్రాంతీయ పార్టీ అని, తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమన్నారు. 2027 చివరికి జమిలి ఎన్నికలకు వీలుగా పార్లమెంటులో బిల్లు పెడతారని తాను ముందే చెప్పానని, దీనిపై వేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లో తాను సభ్యుడినన్నారు. బిల్లుపై పార్టీ అధ్యక్షుడు నిర్ణయం తీసుకుంటారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారాన్ని మోపిందన్నారు. దీనికి నిరసనగా ఈనెల 27న నిరసన మద్దతు తెలపాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జి.సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అల్వార్‌దాస్ మైదానంలో మెప్మా బజార్

» డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయం



అల్వార్‌దాస్ మైదానంలో మెప్మా బజార్ కోసం ఏర్పాట్లు

ఎంవీపీ కాలనీ/ వెంకోజీపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ, మెప్మా ఆధ్వర్యంలో బుధవారం నుంచి స్వయం సహాయక సంఘాల మేళా నిర్వహించనున్నారు. స్థానిక అల్వార్‌దాస్ మైదానంలో మేళా నిర్వహణకు భారీ షెడ్డులతో ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు మెప్మా బజార్ ప్రారంభించనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు.

ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఈ ఉత్సవ్ ఎస్‌హెచ్‌జీ మేళా స్వయం సహాయక సంఘాలు రూపొందించిన పలు ఉత్పత్తులతో స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ మేళాపై ఇప్పటికే ఆటోలు, ఫ్లెక్సీలు ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. బుధవారం నుంచి ఈ నెల 29 వరకు నిర్వహిస్తామని, ప్రజలు సందర్శించి స్వయం సహాయక సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని కమిషనర్ తెలిపారు.

జీవీఎంసీ పరిధిలోని స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచుతారు. ప్రదర్శనతో పాటు విక్రయాలు కూడా ఉంటాయి. ఇందులో వంద స్టాళ్ల విక్రయాల కోసం, మరో 20 స్టాళ్ల ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి, వారికి సరైన ప్రాచుర్యం కల్పించడం, తద్వారా వారికి ఆర్థిక ప్రయోజనం చేకూరేలా ఇలాంటి మేళాలను నిర్వహిస్తోంది. కాగా విక్రయాలు, ప్రదర్శనల్లో పాల్గొనని డ్వాక్రా సంఘాల సభ్యులను కూడా ఈ ప్రదర్శనకు కచ్చితంగా వచ్చేలా చూడాలని అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల వారిలో స్ఫూర్తి కలుగుతుందనే భావనతో నగరంలోని సభ్యులందరూ పాల్గొనేలా తగిన ఆదేశాలు జారీ చేశారు. ఐదు రోజుల పాటు ప్రదర్శన నిర్వహించనున్నారు.

సరోగసి విధి విధానాలపై చర్చ

మహారాణిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సరోగసిపై కేజీహెచ్‌లో మంగళవారం మెడికల్ బోర్డు సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశమైన వైద్యుల కమిటీ సభ్యులకు సరోగసి అర్హతా పత్రాలను, విధి విధానాల ప్రతులను అందజేశారు. సరోగసికి అనుమతి మంజూరు చేసేందుకు అర్హులెవరన్నది నిర్ణయించారు. సరోగసికి ఇష్టపడేవారిని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. సరోగసి తల్లి వివరాలు, ఆమె ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని కమిటీ సభ్యులు సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ సంధ్యా దేవి, డాక్టర్ చక్రవర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐపీఈలో ముగిసిన మూడు రోజుల శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఐపీఈ అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ (ఐపీఈ)లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు, కాలేజీలు, పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు/అధ్యాపకుల మూడు రోజుల శిక్షణ ముగిసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిది నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 35 మంది విద్యార్థులకు, 35 మంది కాలేజీ/ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు/అధ్యాపకులకు రెండు కేటగిరీల్లో శిక్షణ ఇచ్చారు.